# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 124 | పేజీలు : 08 | సోమవారం | 11-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## ఆ పెద్ద మనసుతో సహకరించండి

**మోదీ పెద్ద మనసు కలవారని వాళ్లు చెబుతుంటారు : మోదీకి రేవంత్ విజ్ఞప్తి**

తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి వినతి

గుజరాత్ మోడల్ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ సహకరించినట్లే తనకు మద్దతివ్వాలని విజ్ఞప్తి

2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని హామీ

రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా సమీక్షించాలని మనవి

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా హెచ్ఐసీసీలో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి హిందీలో ప్రసంగించి అందరి దృష్టిని ఆకర్షించారు. దేశాభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేస్తామని స్పష్టం చేస్తూనే, తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను ప్రధాని ముందుంచారు.కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడూ మోదీ చాలా పెద్ద మనసున్న వారని చెబుతుంటారు, ఆ పెద్ద మనసుతో తెలంగాణ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని మోదీని రేవంత్ కోరారు. దేశ ప్రగతికి సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయబోమని, వికసిత్ భారత్ నిర్మాణంలో తెలంగాణను భాగస్వామిని




2


## రాగల 48 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం

ఏపీ తీరంపై వాతావరణ మార్పులు... రెండు రోజుల్లో అల్పపీడనం

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశం

మన్నార్ గల్ఫ్ వద్ద కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం వరకు విస్తరించిన వాతావరణ ద్రోణి



2

## చంద్రబాబు నివాసానికి వెళ్లి భేటీ అయిన ప్రధాని మోదీ

హైదరాబాదులో మోదీ పర్యటన

జూబ్లీహిల్స్ లో చంద్రబాబు నివాసానికి వెళ్లిన మోదీ

ప్రధానికి సాదర స్వాగతం పలికిన చంద్రబాబు, లోకేష్

2



## నాపై దుష్ప్రచారం చేస్తున్నారు..

**వేదికపై కంటతడి పెట్టిన బండి సంజయ్**

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

జై శ్రీరామ్ నినాదంతోనే గడీలను బద్దలుకొట్టామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. జై శ్రీరామ్ నినాదంతోనే పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చామని, అదే నినాదంతో తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం

2



## కర్ణాటక మంత్రి డి. సుధాకర్ కన్నుమూత

బెంగుళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డి. సుధాకర్ కన్నుమూత

మోకాలి శస్త్రచికిత్స తర్వాత ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో నెల రోజులుగా చికిత్స

నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సుధాకర్

డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడు

2



## ఈ 'మామ' మీకు అన్ని విధాలా మంచి చేస్తాడు

**సీఎంగా విజయ్ తొలి ప్రసంగం**

2

తమిళనాడులో కొత్త శకం ప్రారంభమైందన్న విజయ్

యువత తనకు అండగా నిలిచిందన్న ముఖ్యమంత్రి

ప్రభుత్వంలో ఒకటే పవర్ సెంటర్ ఉంటుందని హామీ

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తామన్న సీఎం



## ఫ్లోరిడాలో చార్టర్ బోటులో పేలుడు.. 11 మందికి గాయాలు

ఫ్లోరిడాలో పేలిన చార్టర్ బోటు.. 11 మందికి గాయాలు

మియామిలోని బిస్కేన్ బేలో శనివారం ఘటన

గ్యాస్ లీకేజ్ వల్లే ప్రమాదం జరిగిందని అనుమానం

ఫ్లోరిడా వైల్డ్‌లైఫ్ కమిషన్, కోస్ట్ గార్డ్ విచారణ

2



## అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా కరుప్పయ్య




2

తమిళనాడులో కొత్త ప్రభుత్వం నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న నూతన ఎమ్మెల్యేలు

ప్రొటెం స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే ఎం.వి. కరుప్పయ్య నియామకం

కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించనున్న ప్రొటెం స్పీకర్

గతంలో అన్నాడీఎంకేలో పనిచేసి, ఇటీవలే విజయ్ పార్టీలో చేరిన కరుప్పయ్య

## పాకిస్థాన్ లో పెళ్లిళ్ల కష్టాలు...

## విందులో ఒక వంటకమే!

మధ్యప్రాచ్య సంక్షోభంతో పాక్ వెడ్డింగ్ పరిశ్రమకు కష్టాలు

పెరిగిన ఇంధన ధరలు, ద్రవ్యోల్బణంతో పెళ్లిళ్ల ఖర్చులు పైపైకి

రాత్రి 10 గంటలకే వేడుకలు ముగించాలంటూ ప్రభుత్వ కఠిన నిబంధనలు

400 మంది నుంచి 150కి పడిపోయిన అతిథుల సంఖ్య

ఖర్చులు తగ్గించుకుంటూ చిన్న బడ్జెట్‌తో పెళ్లిళ్లు చేస్తున్న ప్రజలు

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

పెళ్లిళ్లంటే అంగరంగ వైభవంగా జరుపుకునే పాకిస్థాన్‌లో ప్రస్తుతం ఆ వేడుకల కళ తప్పింది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంక్షోభం, దేశంలో రికార్డు స్థాయికి చేరిన ద్రవ్యోల్బణం, ప్రభుత్వం విధించిన కఠిన నిబంధనలు ఆ దేశ వెడ్డింగ్ పరిశ్రమను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. దీంతో ఒకప్పుడు ఘనంగా జరిగే వివాహాలు ఇప్పుడు నిరాడంబరంగా, తక్కువ బడ్జెట్‌లో ముగుస్తున్నాయి. ఈ మేరకు పాకిస్థాన్ ప్రముఖ దినపత్రిక 'డాన్'లో ఫాతిమా ఎస్ అత్తర్‌వాలా అనే రచయిత్రి తన కథనంలో విశ్లేషించారు. పెరుగుతున్న ఇంధన ధరలు, ద్రవ్యోల్బణం కారణంగా వెడ్డింగ్ ఖర్చులు విపరీతంగా పెరిగాయని 'షాదియానా' అనే వెడ్డింగ్-టెక్ స్టార్టప్ సహ వ్యవస్థాపకురాలు ఇజ్జా జమాన్ చెప్పిన వివరాలను ఫాతిమా తన కథనంలో ఉటంకించారు. "చాలా కల్యాణ మండపాలు ఒక్కో వ్యక్తిపై రూ.500 వరకు రేట్లను పెంచేశాయి. ఇంధన ధరల అనిశ్చితి

## తిరుచురాపల్లి ఈస్ట్ సీటుకు రాజీనామా

2



# రాగల 48 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం

మొదటి పేజీ తరువాయి

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. రాబోయే 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ అమరావతి వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. మన్నార్ గల్ఫ్, దానిని ఆనుకుని ఉన్న శ్రీలంక పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతోనే ఈ అల్పపీడనం ఏర్పడనుందని పేర్కొన్నారు.ప్రస్తుతం ఈ ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి స్థిరంగా కొనసాగుతోంది. ఇది మరింత బలపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.మరోవైపు, మధ్య, ఎగువ స్థాయి పశ్చిమ గాలుల్లో కొనసాగుతున్న ద్రోణి కోస్తాంధ్రపై ప్రభావం చూపుతోంది. సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఈ ద్రోణి... ఈశాన్య బీహార్ నుంచి జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా తీరప్రాంత ఆంధ్రప్రదేశ్‌లోని మధ్య భాగాల వరకు విస్తరించి ఉంది. ఈ రెండు వాతావరణ వ్యవస్థల ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# చంద్రబాబు నివాసానికి వెళ్లి భేటీ అయిన ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ హైదరాబాద్ పర్యటకు విచ్చేశారు. ఈ క్రమంలో, జూబ్లీహిల్స్ లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లారు. తమ ఇంటికి వచ్చిన ప్రధానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు, ఏపీ మంత్రి నారా లోకేష్ సాదర స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబుతో మోదీ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దాదాపు గంట పాటు జరిగిన సమావేశంలో పలు ముఖ్యమైన అంశాలపై చర్చించుకున్నారు.ఈ భేటీలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ పాలన, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. అదే సమయంలో, తెలంగాణలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలపై మాట్లాడుకున్నట్టు తెలుస్తోంది.ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో, తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన కీలక అంశాల నేపథ్యంలో ఈ భేటీ జరగడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.అంతకుముందు, ప్రధాని మోదీ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.హైదరాబాద్ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ గచ్చిబౌలిలో సింధు ఆసుపత్రిని ప్రారంభించారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సింధు ఆసుపత్రిని పరిశీలించారు.

# నాపై దుష్ప్రచారం చేస్తున్నారు..

మొదటి పేజీ తరువాయి

చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదికపై మాట్లాడుతూ.. తనపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారంటూ కంటతడిపెట్టుకున్నారు. తాము సనాతన ధర్మం కోసం పనిచేస్తున్నామని అన్నారు. తమ ధర్మాన్ని కించపరిస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు.బండి సంజయ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'జై శ్రీరామ్ అంటే కడుపు నిండుతుందా అని కొందరు అన్నారు. జై శ్రీరామ్ నినాదమే మాలో పోరాటపటిమ నింపింది. జై శ్రీరామ్ అంటే కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారు. పార్టీకి తలవంపులు తెచ్చే పనులు నేను చేయను. రాజకీయంగా ఎదుర్కోలేకే నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. భయపడడానికి నేను ఫామ్‌హౌస్‌లోని ఎలుకను కాను. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు ఏమయ్యాయి?'.'రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. బీజేపీ నేతలు భేదాభిప్రాయాలు వీడాలి. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పోరాడాలి. మోదీ లేనిదే తెలంగాణలో ప్రభుత్వం నడవదు. బెంగాల్‌లో బీజేపీకి గెలుపు అంత సులభంగా రాలేదు. 300 మంది బీజేపీ కార్యకర్తలు బలిదానం చేశారు. కేరళలోనూ బీజేపీ కార్యకర్తలపై దాడులు జరిగాయి. నిధులు ఇచ్చేది మనం.. అభివృద్ధి చేసేదీ మనమే' అని అన్నారు.

# తిరుచురాపల్లి ఈస్ట్ సీటుకు విజయ్ రాజీనామా

మొదటి పేజీ తరువాయి

చెన్నై: తిరుచురాపల్లి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం సీటుకు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆదివారంనాడు రాజీనామా చేశారు. మంత్రులు కేఏ సెంగోట్టియన్, పి.వెంకటరణన్‌లు లెజిస్లేటివ్ అసెంబ్లీ సెక్రటరీని కలిసి విజయ్ రాజీనామా లేఖను అందజేశారు.ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పెరంబూర్, తిరుచురాపల్లి ఈస్ట్ అసెంబ్లీ సీట్లలో విజయ్ గెలిచారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీఏ)-1951 నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి రెండు నియోజకవర్గాల్లోనూ గెలిస్తే ఒక సీటును వదులుకోవలసి ఉంటుంది. ఈ నేపథ్యంలో తిరుచ్చి ఈస్ట్‌ను వదిలి పెరంబూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగాలని విజయ్ నిర్ణయించారు. దీంతో ఖాళీ అయిన తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గానికి ఆరు నెలల్లోగా తిరిగి ఉప ఎన్నిక జరుగుతుంది.

# కర్ణాటక మంత్రి డి. సుధాకర్ కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

కర్ణాటక ప్రణాళిక, గణాంకాల శాఖ మంత్రి డి. సుధాకర్ (66) కన్నుమూశారు. గత నెల రోజులుగా అనారోగ్యంతో బెంగళూరులోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున 3:15 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు ఆస్పత్రి వర్గాలు అధికారికంగా ప్రకటించాయి.సుధాకర్ కొద్దికాలం క్రితం మోకాలి శస్త్రచికిత్స కోసం మణిపాల్ ఆస్పత్రిలో చేరారు. సర్జరీ అనంతరం ఆయన ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ సోకింది. దీంతో పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఏప్రిల్ 20న ఆయనను కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆయన లైఫ్ సపోర్ట్‌పై చికిత్స పొందుతున్నారు. ఊపిరితిత్తుల మార్పిడికి కూడా వైద్యులు సన్నాహాలు చేస్తున్న క్రమంలోనే ఆయన మరణించడం విషాదకరం.చిత్రదుర్గ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సుధాకర్, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను తన రాజకీయ గురువుగా భావించేవారు. వారిద్దరి మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మొత్తం నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సుధాకర్ 2008లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి బీజేపీ ప్రభుత్వంలో మంత్రిగా కూడా పనిచేశారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి హిరియూరు నియోజకవర్గం నుంచి 2013, 2023లలో విజయం సాధించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.మంత్రి సుధాకర్ మృతి పట్ల డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన సన్నిహితుడు, మంత్రివర్గ సహచరుడు సుధాకర్ మరణం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థించారు. కర్ణాటక ప్రతిపక్ష నేత ఆర్. అశోక కూడా సుధాకర్ మృతికి సంతాపం తెలిపారు.

# ఈ 'మామ' మీకు అన్ని విధాలా మంచి చేస్తాడు

మొదటి పేజీ తరువాయి

తమిళనాడులో నిజమైన లౌకిక, సామాజిక న్యాయంతో కూడిన కొత్త శకం ప్రారంభమైందని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్ అన్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. "యువత నాకు అండగా నిలిచింది. ఈ విజయ్ 'మామ' మీకు అన్నివిధాలా మంచి చేస్తాడు. మీరే నా ప్రాణం" అని ముఖ్యమంత్రి తన తొలి ప్రసంగంలో పేర్కొన్నారు.నేను మీ ఇంట్లో కుటుంబ సభ్యుడినని, అన్నలా, తమ్ముడిలా ఉంటానని హామీ ఇచ్చారు. నేను మీ అందరివాడినని వ్యాఖ్యానించారు. తనకు ఓటు వేసి గెలిపించినందుకు యావత్ తమిళ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు.హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ముఖమే విజయ్ ముఖమని వ్యాఖ్యానించారు. టీవీకే కార్యకర్తలు లేకుంటే తాను ఇక్కడ లేనని విజయ్ అన్నారు. ఎవరికీ తెలియకుండా చీకటి రాజకీయాలు చేయబోనని, ఏది ఉన్నా నేరుగా మాట్లాడుతానని తెలిపారు. అన్నీ నేర్చుకోవడానికి తనకు సమయం ఇవ్వాలని కోరారు. తన ప్రభుత్వంలో ఒకటే పవర్ సెంటర్ ఉంటుందని హామీ ఇచ్చారు. మహిళలను కాపాడటమే తమ ప్రభుత్వం లక్ష్యమని అన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తామని వెల్లడించారు. తనకు ఆకలి, పేదరికం తెలుసునని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లోకి వస్తే మేం చూసుకుంటామని ప్రజలు తనను ప్రేమగా పిలిచారని అన్నారు. నేను దేవదూతనేమీ కాదని సాధారణ కుటుంబం నుంచే వచ్చానని పేర్కొన్నారు. ఆలోచిస్తాం, అది చేస్తాం, ఇది చేస్తామని చెప్పమని హామీ ఇచ్చారు. ఏది సాధ్యమో అదే చేస్తామని అన్నారు.

# అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా కరుప్పయ్య

మొదటి పేజీ తరువాయి

తమిళనాడు అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎమ్మెల్యే ఎం.వి. కరుప్పయ్య నియమితులయ్యారు. సోమవారం నాడు, కొత్తగా ఎన్నికైన సభ సమావేశం కానున్న నేపథ్యంలో, ఈ నియామకం జరిగింది. గతంలో అన్నాడీఎంకేలో కీలక నేతగా ఉన్న ఆయన, ఆ పార్టీలో ప్రాధాన్యత తగ్గడంతో ఈ ఏడాది ప్రారంభంలో విజయ్ నేతృత్వంలోని టీవీకేలో చేరారు.ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, దశాబ్దాల డీఎంకే, అన్నాడీఎంకే ఆధిపత్యానికి తెరదించింది. ఆదివారం ఉదయం చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, ముఖ్యమంత్రిగా విజయ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 9 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు.సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే విజయ్.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, "సింగా పెన్" ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు, మాదకద్రవ్యాల నిరోధక ప్రత్యేక విభాగం ఏర్పాటుకు సంబంధించిన మూడు కీలక ఫైళ్లపై తొలి సంతకాలు చేశారు. ఈ పరిణామాల మధ్య, చోళవందాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన కరుప్పయ్యను ప్రొటెం స్పీకర్‌గా నియమించారు. ఆయన కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించడంతో పాటు, సభ తొలి సమావేశాలను పర్యవేక్షిస్తారు.1980 నుంచి అన్నాడీఎంకేలో ఉన్న కరుప్పయ్య, 2011లో ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే, 2016, 2021 ఎన్నికల్లో టికెట్ లభించకపోవడంతో అసంతృప్తికి గురయ్యారు. ఈ క్రమంలో టీవీకేలో చేరారు. 2026 ఎన్నికల్లో టీవీకే అభ్యర్థిగా చోళవందాన్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

# ఆ పెద్ద మనసుతో సహకరించండి

మొదటి పేజీ తరువాయి

చేస్తామని ఆయన ప్రధానికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం కేవలం కేంద్ర ప్రభుత్వానిది కాదని, ఇది తెలంగాణ అభివృద్ధి ఉత్సవమని రేవంత్ రెడ్డి అన్నారు. "ప్రధాని మోదీ వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని ప్రకటించిన రోజే, దానికి అనుగుణంగా మేం 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ డాక్యుమెంట్‌ను విడుదల చేశాం. దేశాన్ని 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న మీ కలను సాకారం చేయడంలో తెలంగాణ 10% వాటాను అందిస్తుంది. దేశ జనాభాలో 3% కంటే తక్కువ ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 5% వాటాను తెలంగాణ అందిస్తోంది. రానున్న రోజుల్లో దీన్ని 10 శాతానికి పెంచడమే మా లక్ష్యం" అని వివరించారు.ఈ లక్ష్య సాధన కోసం ఒక ఆసక్తికరమైన పోలికను ప్రధాని ముందుంచారు. "గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు, మీరు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆనాడు మీ 'గుజరాత్ మోడల్'కు ఆయన సహకరించారు. ఇప్పుడు మీరు ప్రధానిగా ఉండగా, నేను ముఖ్యమంత్రిగా ఉన్నాను. రాష్ట్ర ప్రజలు నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రానున్న పదేళ్లలో 'తెలంగాణ మోడల్' నిర్మించి, 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి మీ ఆశీస్సులు, సహకారం ఎంతో అవసరం" అని రేవంత్ విజ్ఞప్తి చేశారు.దేశానికి ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ నగరాలు గ్రోత్ ఇంజన్ల వంటివని, ఈ నగరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ నగరాల నుంచి వచ్చే అభివృద్ధి ప్రతిపాదనలకు సత్వరమే అనుమతులు ఇచ్చేందుకు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ లేదా సింగిల్ విండో వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.తెలంగాణకు అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ, మూసీ నది సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ రేడియల్ రోడ్లు, హైదరాబాద్-మచిలీపట్నం పోర్టు మధ్య 12 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవే, రైల్వే లైన్ వంటి పెండింగ్ ప్రాజెక్టులను సీఎం రేవంత్ ప్రస్తావించారు. "ఈ ప్రాజెక్టులపై చర్చించేందుకు తెలంగాణ కోసం ఒక రెండు గంటల సమయం కేటాయించి ప్రత్యేక సమీక్ష నిర్వహించండి. మా ప్రతిపాదనలన్నింటినీ మీ ముందు ఉంచుతాం" అని కోరారు.

# ఫ్లోరిడాలో చార్టర్ బోటులో పేలుడు.. 11 మందికి గాయాలు

మొదటి పేజీ తరువాయి

అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో ఓ చార్టర్ బోటులో భారీ పేలుడు సంభవించింది. మియామి నగర సమీపంలోని బిస్కేన్ బేలో శనివారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒక చిన్నారితో సహా 11 మంది గాయపడ్డారు. పర్యాటకులతో ప్రసిద్ధి చెందిన హాలోవర్ సాండ్‌బార్ సమీపంలో ఈ ఘటన జరిగింది."నాటీ నేబర్స్" అనే 40 అడుగుల పడవలో సుమారు 14 మంది ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ధాటికి బోటులో ఉన్న ప్రయాణికులు గాల్లోకి ఎగిరి నీటిలో పడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే మియామి-డేడ్ ఫైర్ రెస్క్యూ, యూఎస్ కోస్ట్ గార్డ్ బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. ప్రమాద తీవ్రత దృష్ట్యా దీనిని 'లెవెల్ 2 మాస్ క్యాజువాలిటీ'గా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో కొందరికి తీవ్రంగా కాలిన గాయాలు కాగా, మరికొందరికి ఇతర గాయాలయ్యాయని అధికారులు తెలిపారు.బోటు ఇంజిన్‌ను స్టార్ట్ చేసే సమయంలో గ్యాస్ లీక్ కావడం వల్లే ఈ పేలుడు జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. బోటు కెప్టెన్ తొందరపడి, భద్రతా నిబంధనల ప్రకారం బ్లోయర్లను ఆన్ చేయకుండానే ఇంజిన్ స్టార్ట్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఒక ప్రత్యక్ష సాక్షి ఆరోపించారు. ప్రస్తుతం ఈ ఘటనపై ఫ్లోరిడా ఫిష్ అండ్ వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ కమిషన్ ప్రధాన దర్యాప్తు సంస్థగా వ్యవహరిస్తుండగా, యూఎస్ కోస్ట్ గార్డ్ కూడా సమాంతరంగా విచారణ జరుపుతోంది. పూర్తి దర్యాప్తు తర్వాతే పేలుడుకు కచ్చితమైన కారణాలు తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

# పాకిస్థాన్ లో పెళ్లిళ్ల కష్టాలు...

మొదటి పేజీ తరువాయి

కారణంగా శీతాకాలం నాటి బుకింగ్స్‌కు ప్రస్తుత ధరలను ఖరారు చేయడానికి కూడా నిర్వాహకులు నిరాకరిస్తున్నారు" అని ఇజ్జా జమాన్ వివరించారు.పెరుగుతున్న ధరలతో పాటు, పాక్ ప్రభుత్వ కఠిన నిబంధనలు కూడా ఈ పరిశ్రమను మరింత దెబ్బతీస్తున్నాయి. రాత్రి 10 గంటలకే వివాహ వేడుకలు ముగించాలని, ఫంక్షన్లలో ఒకే వంటకాన్ని (శీఅవ-ఽఅంష్త్ర జూశీశ్రీఱ౬ఎ) మాత్రమే అందించాలని ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే పోలీసులు జోక్యం చేసుకుంటున్నారు. ఈ కారణంగా ఇస్లామాబాద్‌లోని అనేక ఫంక్షన్ హాళ్లు మూతపడ్డాయని ఫాతిమా పేర్కొన్నారు. అమెరికా, ఇరాన్ మధ్య పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన శాంతి చర్చల సమయంలో మార్గల్లా హిల్స్ సమీపంలో విధించిన భద్రతా వలయాలు, నగరవ్యాప్తంగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అమలుచేస్తున్న వీఐపీ ప్రోటోకాల్స్ వల్ల అతిథులు ఆలస్యంగా వస్తున్నారని, ఇది కూడా నిర్వాహకులకు సవాలుగా మారిందని ఆమె తెలిపారు.పాకిస్థాన్ వెడ్డింగ్ పరిశ్రమ చాలా పెద్దది. గత శీతాకాలంలో కేవలం కరాచీ నగరంలోనే దాదాపు రూ.33 బిలియన్ల వ్యాపారం జరిగిందని మీడియా నివేదికలు చెబుతుండగా, మొత్తం పాక్ మార్కెట్ విలువ రూ.900 మిలియన్లుగా 'షాదియానా' అంచనా వేసింది. అయితే, ఈ పరిశ్రమ ఇప్పటికీ అసంఘటితంగానే ఉంది. ఉదాహరణకు, కరాచీలోని నార్త్ నాజిమాబాద్ వంటి ప్రాంతంలోనే 60 నుంచి 70 వెడ్డింగ్ హాళ్లు ఉంటాయి. సరైన వేదికను ఎంచుకోవడానికి ఒక చోటు నుంచి మరో చోటుకి తిరగాల్సిందే. తీరా వెళ్లాక చాలా వరకు హాళ్లు అప్పటికే బుక్ అయి ఉంటాయి.యూఎస్-ఇరాన్ సంక్షోభం, ద్రవ్యోల్బణానికి ముందు 'షాదియానా' ప్లాట్‌ఫామ్‌లో సగటు వివాహ బడ్జెట్ రూ.6 లక్షలుగా ఉండేది. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా రూ.20,000 నుంచి రూ.4.4 మిలియన్ల వరకు బడ్జెట్‌తో పెళ్లిళ్లు జరిగాయి. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఒకప్పుడు సగటున 400 మంది అతిథులతో జరిగే పెళ్లిళ్లు ఇప్పుడు 150 మందికి పరిమితం అయ్యాయి. వెన్యూ, ఫొటోగ్రఫీ, క్యాటరింగ్ వంటి వాటిపై బడ్జెట్‌ను గణనీయంగా తగ్గించుకుంటున్నారు.మహమ్మారి సమయంలో కార్యకలాపాలు ప్రారంభించి, ఆ తర్వాత రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, దేశీయ ఆర్థిక సంక్షోభం, ఇప్పుడు మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు వంటి ఎన్నో ఆర్థిక సవాళ్లను ఎదుర్కొన్నామని ఫాతిమా తన కథనంలో పేర్కొన్నారు. ఆర్థిక ఒత్తిళ్లు ఎంత పెరిగినా, వివాహాలు ఆగవని, కాకపోతే మునుపటి కంటే చాలా తక్కువ బడ్జెట్‌తో జరుగుతాయని ఆమె స్పష్టం చేశారు.

## పటాన్ చెరులో ఘనంగా ప్రారంభమైన
# 10వ జాతీయ కరాటే ఛాంపియన్ షిప్
### పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) ఆధ్వర్యంలో



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10 :** భారత రత్న పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమైన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10వ జాతీయస్థాయి ఓపెన్ కరాటే పోటీలు విజయవంతం కావాలని కోరారు.విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తివిద్యార్థి దశ నుండే క్రీడలపై ఆసక్తి పెంచాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే జిఎంఆర్ పిలుపునిచ్చారు. సమాజం నుండి మాదకద్రవ్యాలను తరిమికొట్టాలని, వాటి దుష్పరిణామాలు విద్యార్థులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.భారీ ఏర్పాట్లు, 2000 మంది క్రీడాకారులులక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటైన పోటీలకు వివిధ రాష్ట్రాల నుండి 2000 మంది క్రీడాకారులు హాజరయ్యారు. గత 10 సంవత్సరాలుగా జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారని, పటాన్చెరు ఖ్యాతి వ్యాప్తి చెందిందని ఎమ్మెల్యే తెలిపారు.

**క్రీడల అభివృద్ధికి పూర్తి సహకారం**

నియోజకవర్గంలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని జిఎంఆర్ స్పష్టం చేశారు. మైత్రి మైదానం ఆధునీకరణ, మూడు మినీ స్టేడియాలు, ఏడాది పొడవునా రాష్ట్ర-జాతీయ పోటీలు పేర్కొన్నారు. పోటీలకు 5 లక్షల రూపాయలు సొంత నిధుల నుంచి అందజేశారు. మాజీ కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, అంజయ్య యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, అమీన్పూర్ మాజీ వైస్చైర్మన్ నరసింహ గౌడ్, దశరథ్ రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి మొదలైనవారు పాల్గొన్నారు. క్రీడాకారులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.





# గజానికో గతుకు... మూలకో మలుపు

**ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి**
**ప్రమాద సూచికల బోర్డులు మాయం వాహనదారులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10,** భద్రాద్రి కొత్త గూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వెంకటాపురం టు భద్రాచలం ప్రధాన ఆర్ అండ్ బి రహదారులు ఇసుక లారీల కారణంగా చాలా చోట్ల బీటీ రోడ్లు నామ రూపాలు లేకుండా దెబ్బ తిన్నాయి. గోతులు జల మయంగా మారి ప్రయాణీకుల పాలిట శాపంగా మారాయి. గజానికో గతుకు మూలకో మలుపు ఉండటంతో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మూలమలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు కూడా కనబడటం లేదని చిన్న పాటి అకాల వర్షానికి రహదారి పై ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు చేరి ప్రధాన రహదారి అధ్వానంగా తయారైందనని,ఇటీవల గోతులు పడిన చోట ప్యాచ్ వర్క్ ಽో ౕ ం అక్కడక్కడా సిప్స్ కుప్పలు పోశారు. గుంతలు పూడ్చటం మరిచారంటూ వాహన దారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పలు ప్రాంతాల్లో రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఆర్ అండ్ బి అధికారుల పర్యవేక్షణ లోపంతో రహదారి పై ఏర్పడిన గోతులను సకాలంలో పూడ్చి వేస్తే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని వాహనదారులు అంటున్నారు.అసలే వచ్చేది వర్షాకాలం రహదారులు ఎలా ఉంటాయో ఊహించు కుంటేనే వాహన దారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.ఇకనైనా ఆ శాఖ అధికారులు జోక్యం చేసుకొని సకాలంలో చిన్న పాటి గోతులు పూడ్చి తే



పరిస్థితి కొంతవరకు పరిష్కారం అవుతుందని కావున ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి తక్షణమే రహదారులు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

# పటాన్‌చెరు ఎండీర్ ఫౌండేషన్‌లో మాతృదినోత్సవ సేవా కార్యక్రమం




**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10 :** ప్రపంచ మాతృదినోత్సవ సందర్భంగా నాలుగు సంవత్సరాలుగా మాతృత్వపు కొత్త ప్రయాణాన్ని ప్రారంభించిన తల్లులు, వారి బుజ్జి బిడ్డలకు బేబీ కిట్లు పంపిణీ చేశారు. పటాన్‌చెరు పట్టణంలోని ఎండీర్ ఫౌండేషన్ కార్యాలయంలో ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

**పంపిణీ కార్యక్రమం**

ఎండీర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్, ఆయన తల్లి మాద్రి తులసి లక్ష్మి పాల్గొని బాలింతలకు బేబీ కిట్లు పంపిణీ చేశారు. పృథ్వీరాజ్ మాట్లాడుతూ, "అమ్మ ప్రేమకు ప్రత్యామ్నాయం లేదు. తల్లులు కుటుంబానికి, సమాజానికి మూలస్తంభాలు" అని పేర్కొన్నారు.

**శుభాకాంక్షలు, కేక్ కట్ మహిళలు**

బాలలు, చిన్నారుల సంక్షేమానికి ఎండీర్ ఫౌండేషన్ నిరంతరం సేవలు చేస్తుందని పృథ్వీరాజ్ తెలిపారు. తులసి లక్ష్మి మహిళలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

**పాల్గొన్నవారి అభినందాలు**

పాల్గొన్న మహిళలు ఫౌండేషన్ సేవలను అభినందించారు. ఆరోగ్యం, విద్య, మహిళా సాధికారత, బాలల సంక్షేమంలో చేస్తున్న కార్యక్రమాలు ప్రజల విశ్వాసాన్ని పొందాయని చెప్పారు. గత నాలుగేళ్లుగా మాతృదినోత్సవ సేవలు కొనసాగుతున్నాయని అధ్యక్షుడు మధు తెలిపారు.




# ప్రతిభకు పట్టం కట్టిన లయన్స్ క్లబ్

**డోర్నకల్ మండలంలో కాడెం శార్వరికి ఘన సన్మానం**

**హైదరాబాద్ పల్స్, మే 10, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమ ఉంటే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా అత్యున్నత ఫలితాలు సాధించగలరని డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన విద్యార్థిని కాడెం శార్వరి, నిరూపించింది. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 600, మార్కులకు 575 మార్కులు సాధించి మండల ప్రభుత్వ పాఠశాలలలో ప్రథమ స్థానం దక్కించుకున్న శార్వరిని ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ సభ్యులు ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సన్మానించారు.మండల కేంద్రంలో నిర్వహించిన ఈ అభినందన కార్యక్రమం ఆనందోత్సాహాల నడుమ జరిగింది. విద్యార్థిని శార్వరికి శాలువా కప్పి, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి ఆమె ప్రతిభను కొనియాడారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని ఇంతటి ప్రతిభ కనబరచడం గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడిన లయన్స్ క్లబ్ సభ్యులు, "ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శార్వరి విజయం ప్రేరణగా నిలుస్తుంది. లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదివితే ఎలాంటి పరిస్థితుల్లోనైనా విజయాన్ని అందుకోవచ్చని ఆమె నిరూపించింది" అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, విద్యార్థిని కృషి కలిసొచ్చినప్పుడే ఇలాంటి అద్భుత విజయాలు సాధ్యమవుతాయని వారు అన్నారు. భవిష్యత్తులో శార్వరి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని శార్వరికి శుభాకాంక్షలు తెలిపారు.




## తండా నాయకుడి ఆకస్మిక మరణం తీరనీలోటు

### సిద్దివినాయక బంజారా యూత్ ప్రెసిడెంట్ బాబు నాయక్



**హైదరాబాద్ పల్స్, మే 10, షాద్నగర్ :** కొత్తూరు మండలం మల్లాపూర్ తండాలో తండా పెద్ద దిక్కు, నాయకుడు అంగోత్ తులసిరామ్ ఆకస్మిక మృతి తీరని లోటని సిద్దివినాయక బంజారా యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాబునాయక్ అన్నారు. నిన్న రాత్రి 1.30 గంటలకు ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందిన విషయం కలచివేసిందని తెలిపారు. ఈ సందర్భంగా బాబు నాయక్ మాట్లాడుతూ తాండలో ఏ కుటుంబాలలో కలహాలు ఉన్న వాళ్లకి నచ్చజెప్పి వాళ్ళ కుటుంబాన్ని కాపాడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని తెలిపారు.మరియు యువకుల విషయంలో ఎలాంటి పరిస్థితులు ఉన్న దిశా నిర్దేశం చేసి సలహాలు సూచనలు ఇవ్వడంలో తాండ పెద్ద నాయకుడిగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో ప్రాధాన్యత ఎక్కువ ఇచ్చారని ఈ సందర్భంగా కొనియాడారు. తన ఆకాల మరణం సంఘటన జరిగాక తన అంతిమయాత్రకి వందల సంఖ్యలో ప్రజలు హాజరు కావడం విశేషం.తన ఆత్మ ఎక్కడున్నా ఆత్మకి శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. ఈ అంతిమ యాత్ర లో యువకులు మహిళలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే రామచంద్ర నాయక్



**హైదరాబాద్ పల్స్, మే 10, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :** డోర్నకల్ మండలం వెన్నారం గ్రామంలో ఆదివారం నిర్వహించిన నూతన దంపతుల ఆశీర్వాద కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కుల వెంకన్న-పావని దంపతుల కుమార్తె ప్రియాంక వివాహం మహేష్‌తో ఇటీవల ఖమ్మం నగరంలోని ఓ కళ్యాణ మండపంలో వైభవంగా జరిగిన విషయం తెలిసిందే. వివాహానంతరం స్వగ్రామంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరై నూతన దంపతులు ప్రియాంక - మహేష్‌లను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ బంధాలు, పరస్పర గౌరవం, ప్రేమాభిమానాలతో దాంపత్య జీవితం ఆనందంగా కొనసాగాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఇలాంటి కుటుంబ వేడుకలు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, బంధుమిత్రులు, పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ యాదవ్, కాసం శేఖర్, ఆంగోత్ వెంకన్న, మధు శెట్టి వెంకన్న, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కళావతి, కొప్పుల రంజాన్, మోహన్, ఉప సర్పంచ్ మల్లయ్య, వెంకన్న తదితర నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

## ఐపీఎల్ నుంచి ముంబై అవుట్..

### థ్రిల్లర్ మ్యాచ్‌లో ఆర్సీబీ అద్భుత విజయం


ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్ ప్రస్థానం ముగిసింది. రాయ్‌పూర్ వేదికగా ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఆఖరి బంతికి రెండు వికెట్ల తేడాతో ఓటమిపాలై ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. కృనాల్ పాండ్యా (73) వీరోచిత ఇన్నింగ్స్, భువనేశ్వర్ కుమార్ అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శన ఆర్సీబీకి చిరస్మరణీయ విజయాన్ని అందించాయి.167 పరుగుల లక్ష్యఛేదనలో ఆర్సీబీకి ఆదిలోనే భారీ షాక్ తగిలింది. దీపక్ చాహర్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే విరాట్ కోహ్లీ గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. పవర్‌ప్లే ముగిసేసరికి కెప్టెన్ రజత్ పటిదార్‌తో సహా మూడు కీలక వికెట్లు కోల్పోయి ఆర్సీబీ 47/3తో కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కృనాల్ పాండ్యా ఒంటరి పోరాటం చేశాడు. మరోవైపు వికెట్లు పడుతున్నా, కండరాల నొప్పితో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నా పట్టుదలగా ఆడి జట్టును విజయానికి దగ్గరగా తీసుకొచ్చాడు.అయితే ముంబై బౌలర్ కార్బిన్ బాష్ (4/26) అద్భుతంగా బౌలింగ్ చేసి మ్యాచ్‌ను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేశాడు. బుమ్రా కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో చివరి ఓవర్‌లో ఆర్సీబీ విజయానికి 15 పరుగులు అవసరమయ్యాయి. రాజ్ బావా వేసిన ఈ ఓవర్ తీవ్ర ఉత్కంఠ రేపింది. ఒక వైడ్, ఒక నోబాల్ వేయగా.. రొమారియో షెపర్డ్ ఔటయ్యాడు. ఆ సమయంలో క్రీజులోకి వచ్చిన భువనేశ్వర్ కుమార్ అద్భుతమైన సిక్సర్ బాది సమీకరణాలను మార్చేశాడు. ఆఖరి బంతికి రెండు పరుగులు అవసరం కాగా, రసిఖ్ సలామ్ దార్ రెండు పరుగులు పూర్తి చేసి ఆర్సీబీకి విజయాన్ని అందించాడు.అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. భువనేశ్వర్ కుమార్ (4/23) తన పదునైన బౌలింగ్‌తో రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్‌తో సహా ముంబై టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. అయితే, తిలక్ వర్మ (57), నమన్ ధీర్ (47) రాణించడంతో ముంబై ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది.ఈ ఓటమితో ముంబై ఇండియన్స్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. మ్యాచ్ అనంతరం ముంబై కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ ఓటమిని జీర్ణించుకోవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు."బ్యాటింగ్‌లో 10-15 పరుగులు తక్కువ చేశాం. తిలక్, నమన్ అద్భుతంగా పోరాడారు. ఈ ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకుని వచ్చే ఏడాది బలంగా పుంజుకుంటాం" అని సూర్యకుమార్ పేర్కొన్నాడు.

హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక



# ఘనంగా హేమ రెడ్డి మల్లమ్మ జయంతి వేడుకలు

**విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, నారాయణఖేడ్ :** కంగ్టి మండల కేంద్రంలో శివశరణి హేమ రెడ్డి మల్లమ్మ జయంతి వేడుకలు ఆదివారం నాడు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హేమ రెడ్డి మల్లమ్మ నూతన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం మరియు హేమ రెడ్డి మల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..''త్యాగానికి, భక్తికి నిలువుటద్దం శివశరణి హేమ రెడ్డి మల్లమ్మ అని కొనియాడారు. ఆమె జీవితం నేటి సమాజానికి ఆదర్శప్రాయమని, ప్రతి ఒక్కరూ ఆమె చూపిన ధర్మ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఆధ్యాత్మికతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. మండల కేంద్రంలో భక్తిభావం ఉట్టిపడేలా విగ్రహ ప్రతిష్ఠాపన చేయడం అభినందనీయమని నిర్వాహకులను ఉద్దేశించి అన్నారు." అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యే ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు,వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు,మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సికింద్రాబాద్‌లో బీజేపీ నాయకుల ర్యాలీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ప్రత్యేక రైలులో చేరుకున్న భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలకు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు స్వాగతం పలికారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా పరేడ్ గ్రౌండ్ సభాస్థలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పడే వరకు పార్టీ పోరాటం కొనసాగుతుందని నాయకులు పేర్కొన్నారు.

# మంత్రుల పర్యటనలో ఎస్పీఎం కార్మిక జేఏసీకి నిరాశ




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో మంత్రుల పర్యటన సందర్భంగా ఎస్పీఎం కార్మిక సంఘాల జేఏసీకి తమ సమస్యలను వినిపించే అవకాశం దక్కకపోవడంపై కార్మికుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. 2018లో ఫ్యాక్టరీ పునఃప్రారంభమైనప్పటి నుంచి ఎదుర్కొంటున్న సమస్యలపై విన్నప పత్రం అందజేయడానికి సిద్ధమైనప్పటికీ, మంత్రులను కలిసే అవకాశం కల్పించలేదని జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు తాజా పర్యటనలో కార్మికులను కలవకుండానే వెళ్లిపోవడం నిరాశ కలిగించిందన్నారు. కార్మిక భవనాలు, విశ్రాంతి గృహాలను వినియోగించుకున్నప్పటికీ, బయట వేచిచూసిన కార్మికులను పట్టించుకోలేదని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు కార్మిక సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమయ్యారని జేఏసీ ఆరోపించింది. సమస్యల పరిష్కారం కోసం త్వరలో తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.

# భయపడటానికి ఫామ్‌హౌస్‌లో ఎలుకను కాదు.. బండి సంజయ్ హాట్ కామెంట్స్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, మెయిన్ డెస్క్:** 'జై శ్రీరామ్' అనే నినాదం వింటేనే కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇవాళ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'జై శ్రీరామ్' అంటే కడుపు నిండుతుందా? అని కాంగ్రెస్ నేతలు హేళనగా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. అదే నినాదంతో బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిందనే విషయాన్ని కాంగ్రెస్ నేతలు మర్చిపోవద్దు. తెలంగాణలోనూ వచ్చే ఎన్నికల్లో పక్కాగా అధికారంలోకి వస్తాం. సనాతన ధర్మం కోసం మేము నిరంతరం పనిచేస్తాం.. మా ధర్మాన్ని కించపరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు' అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

**గ్యారంటీలపై నిలదీత..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ధాన్యం కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర బీజేపీ నేతలకు కీలక సూచన చేశారు. నాయకులు తమ మధ్య ఉన్న అభిప్రాయభేదాలను పక్కన పెట్టి పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడుతూ.. 'బీజేపీ కార్యకర్తను అయినందుకు నేను ఎంతగానో గర్వపడుతున్నాను. పార్టీ తల వంచుకునే పని నేను ఎప్పుడూ చేయలేదు. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. బెదిరింపులకు భయపడటానికి నేనేమీ ఫామ్‌హౌస్‌లో దాక్కునే ఎలుకను కాదు' అని బండి సంజయ్ ఫైర్ అయ్యారు.

# ప్రైవేట్ స్కూల్స్ మరియు కాలేజీల బస్ డ్రైవర్స్ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ దండే విఠల్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణం చెక్ పోస్ట్ ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రైవేట్ కాలేజీలు మరియు స్కూల్ బస్ డ్రైవర్స్ యూనియన్ కార్యాలయాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ విద్యార్థుల భద్రతే ముఖ్యమని, డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, కనీస వేతనాలు అందేలా చూస్తానని త్వరలోనే ప్రైవేట్ కాలేజీలు స్కూల్ వాళ్ళతో ఒక మీటింగ్ ఏర్పాటు చేసి మీ సమస్యలని పరిస్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ దస్తగిరి,కాంగ్రెస్ పార్టీ కొమరంబీం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మాజీ సంతోష్, యూనియన్ అధ్యక్షులు షేక్ షబీర్, వైస్ ప్రెసిడెంట్ కొసరి మనోజ్,కార్యదర్శి గొల్లపల్లి రవి, సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు, కార్యకర్తలు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# శభాష్ తిరుమలేష్ ప్రత్యేకంగా అభినందించిన గొంగిడి మహేందర్ రెడ్డి

**ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్టీ అభివృద్ధికి కృషి చేయడం పట్ల కితాబు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ ను రాష్ట్ర నాయకులు, మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం, కార్యకర్తలకు మనోధైర్యం నింపేందుకు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం, గ్రామంలో నెలకొన్న ఇబ్బందుల పరిష్కారానికి నిత్యం తిరుమలేష్ చేస్తున్న సేవలు, పోరాటాల పట్ల మహేందర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ఇతర మండలాల కంటే కొంత ఎక్కువగా కృషి చేస్తున్నట్లు తిరుమలేష్ ను ప్రశంసించారు. మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో సమిష్టిగా కలిసి పనిచేయడం సమన్వయంతో ముందుకెళ్లడం ఆనందంగా ఉందన్నారు. అధికార పార్టీ బెదిరింపులకు భయపడకుండా తలొగ్గకుండా తిరుమలేష్ నిర్భయంగా ముందుకెళు‌న్నాడని పార్టీని కూడా మండలంలో ముందుకు నడిపిస్తున్నట్లు మహేందర్ రెడ్డి చెప్పారు.


# తెలంగాణతో ప్రధాని మోడీకి ఎంతో అనుబంధం.. సభలో బీజేపీ స్టేట్ చీఫ్ ఆసక్తికర ప్రసంగం



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, తెలంగాణ బ్యూరో: తెలంగాణతో ప్రధాని మోడీకి ఎంతో అనుబంధం ఉందని బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు అన్నారు. ఆదివారం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన సభలో ఆయన ఆసక్తికర ప్రసంగం చేశారు. ప్రధానికి స్వాగతం పలకడానికి సభకు లక్షలాది మంది వచ్చారని, ఈ సభ రేపు తెలంగాణలో రాబోయేది భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వానికి సంకేతమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోడీకి తెలంగాణతో ఎంతో అనుబంధం ఉందని చెప్పుకొచ్చారు. ఎందుకంటే నాడు నిజాం నుంచి హైదరాబాద్ స్టేట్‌ని దేశంలో విలీనం చేసిన రోజు సెప్టెంబర్ 17 అని, అదే రోజు ప్రధాని మోడీ పుట్టిన రోజు అని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అయితే, ప్రధాని తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 9,700 కోట్ల ప్రాజెక్టులను రాష్ట్రానికి, దేశానికి అంకితం చేశారని తెలిపారు. నాడు భారత దేశంలో నక్సలైట్లు బీజేపీ, ఏబీవీపీ కార్యకర్తలను హతమార్చారని గుర్తుచేశారు. నేడు భారత దేశం మొత్తం కూడా నక్సలైట్స్ ముక్త్ భారత్‌గా అవతరించిందని, దాని ఘనత నరేంద్ర మోడీదన్నారు. మనం దేశ వ్యతిరేక శక్తులతో పోరాడుతున్నామని ఫైర్ అయ్యారు. దేశాన్ని దక్షిణాది, ఉత్తరాది అంటూ విభజించే పార్టీలతో కొట్లాడుతున్నామని వివరించారు. కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకున్న శక్తులతో మనం పోరాడుతున్నామని చెప్పుకొచ్చారు.

# లేబర్ కోడ్స్ ప్రతుల దహనం

**కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం తప్పదన్న సిఐటియు**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టౌన్) మండల కేంద్రంలోని హమాలీ కార్మికుల అడ్డా వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన లేబర్ కోడ్స్ ఫైనల్ రూల్స్ గెజిట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ లేబర్ కోడ్స్ కార్మిక వ్యతిరేక విధానాలకు ప్రతీకలని విమర్శించారు. కార్మికులు దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినం, కనీస వేతనం, సామాజిక భద్రత వంటి హక్కులను కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తోందన్నారు.గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని కూడా నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్మికులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల హక్కులను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా పోరాటాలు కొనసాగుతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు గిరుగులే చందు, తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు గుజ్జ రమేష్‌తో పాటు మెరుగు సుధాకర్, షెండే ఆకాష్, కుత్తర్మారే గణేష్, సల్ల మహేష్, షెండే చంద్రకాంత్, నన్న సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య భద్రతకు సీ.ఎం.ఆర్.ఎఫ్




**కుత్బుల్లాపూర్, మే 10, హైదరాబాద్ పల్స్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను చింతల్‌లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జీడిమెట్ల 132వ డివిజన్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని, ప్రజల ఆరోగ్య భద్రత కోసం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ సేవ చేయడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు

# పాకిస్థాన్ కి బిగ్ షాక్.. పోలీస్ స్టేషన్ పైనే ఆత్మాహుతి దాడి !!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10 :**
పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రవాదులు రెచ్చిపోయారు. ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లోని బన్నూ జిల్లాలో శనివారం జరిగిన భారీ ఉగ్రదాడి దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఫతేఖేల్ పోలీస్ స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు పోలీసులు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. భారీ పేలుడు శబ్దంతో ప్రాంతమంతా ఒక్కసారిగా భయాందోళనలకు గురైంది.

**పేలుడు పదార్థాలతో నింపిన వాహనం**
భద్రతా వర్గాల సమాచారం ప్రకారం.. ఉగ్రవాదులు పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని పోలీస్ స్టేషన్‌లోకి దూసుకెళ్లించి భారీ విధ్వంసం సృష్టించాలని యత్నించారు. అయితే, భద్రతా దళాలు ముందుగానే అప్రమత్తమై వాహనాన్ని లక్ష్యానికి చేరకముందే అడ్డుకుని పేల్చివేశాయి. దీంతో మరింత పెద్ద ప్రాణనష్టం తప్పిందని అధికారులు తెలిపారు.

**కాల్పులతో మార్మోగిన ప్రాంతం..**
వాహనం పేలిన వెంటనే డజన్ల కొద్దీ సాయుధ ఉగ్రవాదులు పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టి కాల్పులు ప్రారంభించారు. భద్రతా దళాలు కూడా ఎదురు కాల్పులు జరపడంతో ప్రాంతమంతా యుద్ధ వాతావరణాన్ని తలపించింది. గంటల పాటు సాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు పోలీసులు వీరమరణం పొందారు. పలువురు సిబ్బంది గాయపడగా, వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు.

**ఇళ్లపైకప్పులు కూలి ఆస్తి నష్టం..**
పేలుడు తీవ్రతకు సమీపంలోని ఇళ్ల పైకప్పులు కూలిపోయాయి. అనేక భవనాలు దెబ్బతిన్నాయి. ప్రజలు ప్రాణభయంతో ఇళ్లను వదిలి బయటకు పరుగులు తీశారు. చిన్నారులు, మహిళలు భయంతో కన్నీళ్లు పెట్టుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఘటన తర్వాత మొత్తం ప్రాంతాన్ని భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.



**ఉగ్రవాదుల కోసం గాలింపు..**
దాడి అనంతరం ఉగ్రవాదుల్లో కొందరు సమీప ప్రాంతాలకు పారిపోయినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో భద్రతా దళాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. డ్రోన్లు, ప్రత్యేక దళాలతో అడవులు, కొండ ప్రాంతాలను జల్లెడ పడుతున్నట్లు సమాచారం. ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ముఖ్యమంత్రి ముహమ్మద్ సోహైల్ అఫ్రిది ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. అమరులైన పోలీసుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

## మీరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా
# నీళ్లు వదలం: పాకిస్థాన్ కు భారత్ వార్నింగ్..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, సెంట్రల్ డెస్క్ :**
పాకిస్తాన్ ఇటీవల సింధు జలాల ఒప్పందం (ఐడబ్ల్యుటి) రద్దుపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని ఆశ్రయించడాన్ని మాజీ ఐఏఎస్ అధికారి కె.బి.ఎస్. సిద్ధూ "వ్యూహాత్మక దౌత్య నాటకం"గా అభివర్ణించారు. ఇది ద్వైపాక్షిక వివాదాన్ని ప్రపంచ మానవతా సంక్షోభంగా చిత్రీకరించడానికి ఉద్దేశించిన చర్య అని ఆయన విశ్లేషించారు. సిద్ధూ రాసిన సేవియర్స్ మ్యాగజైన్ కథనం ప్రకారం, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఐడబ్ల్యుటి సస్పెన్షన్‌ను లేవనెత్తాలన్న పాకిస్తాన్ నిర్ణయం, సాహసమైన ఫలితాన్ని సాధించడం కంటే అంతర్జాతీయ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడానికే ఎక్కువగా ఉద్దేశించిందని పేర్కొంది. "ఐడబ్ల్యుటి సస్పెన్షన్ ఇంటర్నేషనలైజ్డ్ బై పాకిస్తాన్" అనే శీర్షికతో ఉన్న ఈ వ్యాసంలో, భారతదేశం 2025లో ఒప్పందాన్ని నిలిపివేసిన తర్వాత ఇస్లామాబాద్ భద్రతా మండలిని ఆశ్రయించడం "ద్వైపాక్షిక భద్రత, జలవనరుల సమస్యను ప్రపంచ మానవతా సంక్షోభంగా" మార్చాలని చూస్తుందని సిద్ధూ వివరించారు. సేవియర్స్ మ్యాగజైన్ విశ్లేషణ ప్రకారం, భారతదేశం ఒప్పందాన్ని నిలిపివేయడానికి కారణం 2025లో జరిగిన పహల్గామ్ "మారణకాండ". ఈ ఘటనలో 26 మంది పౌరులు మరణించారు. ఈ దాడిని "పాకిస్తాన్-మద్దతుగల ఉగ్రవాదులు" చేశారని భారతదేశం ఆరోపించింది. అనేక అంతర్జాతీయ విశ్లేషణలు భారతదేశం ఎగువ పరీవాహక ప్రాంత దేశం అనే విషయాన్ని విస్మరిస్తున్నాయని, ఢిల్లీ భద్రతాపరమైన ఆందోళనలను సరిగా పరిగణనలోకి తీసుకోవడం లేదని సిద్ధూ వాదించారు. భారతదేశ చర్యలను పాకిస్తాన్ 'దౌత్య ఎత్తుగడకు' కేవలం ప్రతిస్పందనగానే చిత్రీకరించే కథనాలను ఈ విశ్లేషణ ప్రత్యేకంగా విమర్శించింది. విశ్లేషణ ప్రకారం, సింధు జలాల ఒప్పందం ప్రారంభం నుంచీ "అసమానమైన ఒప్పందం"గా ఉంది. భారతదేశం భౌగోళికంగా ఎగువన ఉన్నప్పటికీ, సింధు నదీ వ్యవస్థలోని దాదాపు 80 శాతం నీటిని పాకిస్తాన్‌కు వదులుకుందని పేర్కొంది. బగ్లిహార్, కిషన్‌గంగ వంటి భారతీయ జలవిద్యుత్ ప్రాజెక్టులను అడ్డుకోవడానికి పాకిస్తాన్ ఒప్పందంలోని సాంకేతిక నిబంధనలను పదేపదే ఉపయోగించిందని, 2023, 2024లలో భారతదేశం ప్రతిపాదించిన ఒప్పంద సవరణలను అంగీకరించడానికి నిరాకరించిందని ఈ విశ్లేషణ ఆరోపించింది. ఒప్పందాన్ని నిలపివేయడానికి భారతదేశానికి గల చట్టపరమైన సమర్థన "ఎక్సెప్టియో నాన్ అడింపులెటి కాంట్రాక్టస్" సిద్ధాంతంపై ఆధారపడిందని సిద్ధూ వాదించారు. "ఒక పక్షం మరొక పక్షానికి నష్టం కలిగిస్తూ తమ నుంచి పనితీరును డిమాండ్ చేయలేదు" అని ఆయన తెలిపారు. ఐడబ్ల్యుటిలో సొంత వివాద పరిష్కార యంత్రాంగాలు ఉన్నందున, భద్రతా మండలికి ఈ ఒప్పందంపై అధికార పరిధి లేదని విశ్లేషణ వెల్లడించింది. పాకిస్తాన్ భద్రతా మండలికి వెళ్లడాన్ని 'వ్యూహాత్మక దౌత్య నాటకం'గా అభివర్ణించింది. పాకిస్తాన్ లక్ష్యం "కార్యాచరణ సంబంధిత చట్టబద్ధమైన ఫలితం" కంటే "అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించడమే" అని ఈ విశ్లేషణ మరింతగా వాదించింది. ఈ విశ్లేషణలోని ఒక ముఖ్య భాగం భారతదేశ మౌలిక సదుపాయాల లోపాలను హైలైట్ చేసింది. సరైన నిల్వ, మళ్లించే మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల తూర్పు నదుల నుండి బిలియన్ల క్యూబిక్ మీటర్ల నీరు పాకిస్తాన్‌కు ప్రవహిస్తూనే ఉందని తెలియజేసింది. షాపూర్ కండి డ్యామ్, ఉజ్ బహుళ ప్రయోజన ప్రాజెక్టుల వంటివి గతంలో ఆలస్యమైనప్పటికీ, ఇప్పుడు వేగంగా అమలు చేస్తున్న ప్రయత్నాలకు ఉదాహరణలుగా చూపబడ్డాయి. సరిహద్దు ఉగ్రవాదం కొనసాగితే, భారతదేశం తాత్కాలిక సస్పెన్షన్ పరిధిని దాటి ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయడాన్ని పరిగణించాలని కూడా ఈ విశ్లేషణ సూచించింది. "పాకిస్తాన్ అంతర్జాతీయీకరణకు భారతదేశం ప్రతిస్పందన యు.ఎన్ లో దౌత్యపరమైన ఖండన మాత్రమే కాకూడదు. అది 'పఠాన్ కోట్ లో బుల్ డోజర్' లా ఉండాలి" అని సిద్ధూ రాశారు. పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను, భారతదేశ జల విధానంలో దీర్ఘకాలిక వ్యూహాత్మక మార్పును ఆయన సూచించారు.



# రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా.. రేవంత్‌కు కనికరం లేదు : హరీశ్‌రావు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, మెయిన్ డెస్క్:**
ఆరుగాలం శ్రమించిన పంట నీటిపాలై రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కనీసం కనీస కనికరం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్న రైతుల కష్టాలను, వానలకు తడిసిన వడ్లను నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరుపై హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్ ప్రభుత్వం వడ్ల కొనుగోలు విషయంలో దారుణంగా ఫెయిల్ అయ్యిందని, రాష్ట్రంలో రైతుల పరిస్థితి చాలా దయనీయంగా మారిందన్నారు. కర్నాలపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి 25 రోజులైందని, ఇప్పటి వరకు కేవలం రెండులారీలు మాత్రమే వచ్చాయన్నారు.

**ధాన్యం కొనేది ఎప్పుడు..**
పదిరోజులకోసారి లారీ వస్తే ఇన్ని వడ్లు ఎప్పుడు కొంటారని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వర్షాలకు వడ్లు తడిసి మళ్లీ ఆరబెట్టినా కొనలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ గ్రామానికి పోయినా రైతులు కల్లాల్లో కన్నీళ్లు పెట్టుకుంటున్నారని, రేవంత్ రెడ్డి ఇంతవరకు వడ్ల కొనుగోళ్లపై ఒక్క రోజైనా కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టారా? మీ మంత్రులతో ఒక్క మీటింగ్ అయినా చేశారా? అంటూ ప్రశ్నించారు. ఢిల్లీకి పోవడం, హైదరాబాద్‌కు రావడం తప్ప వేరే పనే లేదా? ఢిల్లీకి వెళ్లి కప్పం కట్టడం తప్ప.. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతుల కష్టాలు ముఖ్యమంత్రికి, మంత్రులకు పట్టవా? అంటూ ఘాటుగా స్పందించారు. మెదక్ జిల్లాలో ఇప్పటివరకు ఏ ఒక్క మంత్రి అయినా వడ్ల కొనుగోళ్లపై సమీక్ష చేశారా? అని నిలదీశారు.

**లెక్కలేదు.. పట్టింపు లేదు..**
ఈ ప్రభుత్వానికి రైతులంటే లెక్క, పట్టింపు లేదని ఆరోపించారు. చిన్నచూపు ఉన్నందు వల్లే ఈ దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీ రూముల్లో కూర్చుని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని, ఆయన ఒకసారి పోలీసులను పక్కనపెట్టి రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు తిరిగితే రైతుల కన్నీళ్లు, కష్టాలు ఏంటో అర్థమవుతాయన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆ పార్టీ సర్పంచులే ఇవాళ వడ్లు కొనాలని కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేస్తున్నారంటే.. కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి ఎంత దయనీయంగా, దారుణంగా తయారైందో ఒకసారి అర్థం చేసుకోవాలని హితవు పలికారు. ప్రతిపక్ష నాయకులు సోషల్ మీడియాలో ట్వీట్లు చేస్తే కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్న ముఖ్యమంత్రికి.. రైతుల బాధల గురించి ఇంటెలిజెన్స్, పోలీసులు నివేదికలు ఇవ్వడం లేదా? అంటూ ప్రశ్నించారు.

**రూపాయి ఇవ్వలే..**
మక్కలు, శనగలు, సన్ ఫ్లవర్ అమ్మిన రైతులకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, జొన్నల కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభమే కాలేదన్నారు. 35 రోజుల నుంచి సన్ ఫ్లవర్ కొనుగోళ్లు ఆగిపోయాయని, కుప్పల కింద ఆ పంటకు చెదలు పడుతున్నా ప్రభుత్వానికి కనికరం లేదన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి వల్లే నేడు అది దివాలా తీసిందని.. ఆ సంస్థ ఎన్‌పీఏ కావడంతో బ్యాంకులు అప్పులివ్వడం లేదన్నారు. దాంతో దొడ్డిదారిన



కోఆపరేటివ్ బ్యాంకు నుంచి మార్క్ ఫెడ్‌కు, అక్కడి నుంచి సివిల్ సప్లైస్‌కు డబ్బులు మళ్లించారని ఆరోపించారు. మీ అవినీతి, తప్పులకు రైతులను బలిచేస్తున్నారా? అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. రేషన్ షాపుల్లో ఏళ్ల తరబడి నిల్వ ఉన్న సుమారు రూ.500 కోట్ల విలువైన దొడ్డు బియ్యం పురుగులు పట్టి ముక్కిపోయాయని ఆరోపించారు. వాటిని అమ్మి రికవరీ చేయాలన్న కనీస సోయి, బాధ్యత కూడా ఈ ప్రభుత్వానికి లేదన్నారు.

**కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరిక..**
ముఖ్యంగా చేగుంట మండలంలోని 10 గ్రామాల్లో వడగండ్ల వాన వల్ల పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక వరుసగా మూడు యాసంగి సీజన్లలో రైతులు నష్టపోతూనే ఉన్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే మేల్కొని లారీలు పంపించి, కాంటాలు పెట్టి వడ్లు కొనాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులం అంతా కలెక్టరేట్లను ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు హెచ్చరించారు.

# అక్రమంగా తరలిస్తున్న 30 ఎద్దులు పట్టివేత..

**ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఎద్దులను స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, మేడ్చల్:**
మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డబిల్‌పూర్ పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం తెల్లవారుజామున పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అక్రమంగా తరలిస్తున్న 30 ఎద్దులను పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌లోని శాస్త్రిపురంకు (టిజి 06 టి 3777) నంబర్ గల లారీ వాహనంలో ఎద్దులను గుంపుగా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.వాహన డ్రైవర్ అహ్మద్ ఖాన్ (47), మోయిన్‌బాగ్, సంతోష్‌నగర్, హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎద్దులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# వి.హనుమంతరావు పోరాటానికి బీర్ల ఐలయ్య మద్దతు....




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
దేశవ్యాప్త జనగణనలో బీసీలకు ప్రత్యేకంగా కులవారీ గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీ, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అంబర్‌పేట లోని తన నివాసంలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ మహత్తర ఉద్యమానికి వి.హనుమంతరావు ని శనివారం రోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మర్యాదపూర్వకంగా కలిసి, దీక్షలో పాల్గొని మద్దతు తెలియజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ… దేశ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీ వర్గాలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం జరగాలంటే బీసీ జనగణన అత్యవసరమని పేర్కొన్నారు. బీసీల అసలు జనాభా లెక్కలు వెలుగులోకి వస్తేనే వారికి రావాల్సిన హక్కులు, అవకాశాలు, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. వి.హనుమంత రావు చేస్తున్న ఈ గొప్ప ఉద్యమానికి బీసీ సమాజం మద్దతు తెలియజేస్తుందని. హనుమంతరావు వెంట మేమంతా ఉంటామని అన్నారు. బీసీ వర్గాల హక్కుల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీ జనగణన చేపట్టి వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు

# నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ హరిబాబు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట, హైదరాబాద్‌కు చెందిన సత్యశ్రీ అనే భక్తురాలు హరిబాబు ఆటోలో కొండ పైకి వెళ్తుండగా, ఆమెకు తెలియకుండానే సుమారు మూడు తులాల బంగారు పుస్తెలతాడు ఆటోలో జారిపడిపోయింది. దానిని గమనించిన హరిబాబు, ఏమాత్రం దురాశ పడకుండా వెంటనే ఎస్.పి.ఎఫ్ కంట్రోల్ రూమ్ ను ఆశ్రయించారు. అధికారుల ద్వారా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ లో అనౌన్స్మెంట్ చేయించి, బాధితురాలిని గుర్తించారు. అనంతరం ఆలయ ఈఓ భవాని శంకర్, ఎస్.పి.ఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు సమక్షంలో ఆ బంగారు గొలుసును బాధితురాలికి అందజేశారు. హరిబాబు ప్రదర్శించిన అసాధారణ నిజాయితీని ఆలయ ఈఓ అధికారులు మరియు భక్తులు ప్రత్యేకంగా అభినందించారు.

## సరదాగా వెళ్లారు.. శవాలై వచ్చారు..
# చెరువులో నలుగురు చిన్నారుల జలసమాధి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, సెంట్రల్ డెస్క్ :** మహారాష్ట్రలోని అమరావతిలో చోటుచేసుకున్న ఒక విషాద ఘటన ఆ ప్రాంతాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సరదాగా గడపాలని వెళ్లిన నలుగురు చిన్నారులు, చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబాల్లో తీరని వేదన మిగిలింది. అమరావతి నగరంలోని ఖోలాపురి గేట్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన నలుగురు చిన్నారులు, ఉదయం పూట వాకింగ్ కోసం ఇంటి నుండి బయలుదేరారు. నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో వారు సమీపంలోని ఘట్‌ఖేడా చెరువు వద్దకు చేరుకున్నారు. అక్కడ నీటిని చూడగానే స్నానం చేయాలనే ఉత్సాహంతో వారు చెరువులోకి దిగారు. అయితే, నీటి లోతును సరిగ్గా అంచనా వేయలేకపోవడంతో వారు ఒకరి తర్వాత ఒకరు నీటిలో మునిగిపోయారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారు ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడం గమనార్హం. మృతులను సోనాలి నరేంద్ర జోషి (16), ఆదిత్య నరేంద్ర జోషి (12), పాయల్ బాబ్లు పండిట్ (21), యశ్ గజానన్ కాక్నే (13) ముఖ్యంగా ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలు మరణించడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పిల్లలు నీటిలో మునిగిపోవడం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు మరియు జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే ఖోలాపురి గేట్ పోలీసులు, జిల్లా విపత్తు నిర్వహణ బృందం సంఘటనా స్థలానికి చేరుకుంది. స్థానిక గ్రామస్థుల సహకారంతో సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టి, నలుగురి మృతదేహాలను చెరువు నుండి వెలికితీశారు. పిల్లలు చెరువులో స్నానానికి వెళ్లిన సమయంలో అక్కడ పెద్దలెవరూ లేకపోవడం వల్ల వారికి సకాలంలో సహాయం అందలేదని స్థానికులు చెబుతున్నారు. లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతానికి వెళ్లడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పోలీసులు



మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో ఘట్‌ఖేడా పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. వేసవి కాలం లేదా సెలవుల సమయంలో పిల్లలు నీటి వనరుల వద్దకు వెళ్లేటప్పుడు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ప్రధాని మోదీ గర్జన కోసం కదిలిన కొమరం భీం జిల్లా

**కమల దళం - పరేడ్ గ్రౌండ్స్ సభకు భారీగా తరలివెళ్లిన బీజేపి శ్రేణులు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం బిజేపి నాయకులు, హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించ తలపెట్టిన తల నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభకు ఆసిఫాబాద్ రోడ్డు రైల్వే స్టేషన్ నుండి కొమరం భీం జిల్లా రెబ్బెన మండల బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా కేసరి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ నవభారత నిర్మాణం ప్రపంచం గర్వించదగ్గ నాయకుడు నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా సభకు తరలివస్తున్నారు. తెలంగాణలో మార్పు కోరుకుంటున్న ప్రజల గొంతుకగా ఈ సభ నిలుస్తుందని, రెబ్బెన మండలం నుండి వందలాది మంది కార్యకర్తలు ఈ మహాసభలో పాల్గొని తమ మద్దతు తెలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. భారత్ మాతాకీ జై మరియు జై బీజేపీ నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహంగా సభకు బయలుదేరారు. ఈ



కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వై కృష్ణకుమారి. జిల్లా కార్యదర్శి చెపూరి నవిన్ గౌడ్. మండల అధ్యక్షులు మల్రాజు రాంబాబు. వల్క శ్రీధర్ మండల స్థాయి నాయకులు, శక్తి కేంద్రాల ఇంచార్జ్‌లు మరియు బూత్ స్థాయి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టికెట్ కోసం రూ.5 కోట్లు అడిగారు..
# టీఎంసీపై మాజీ క్రికెటర్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, సెంట్రల్ బ్యూరో: పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత టీఎంసీలో ముసలం మొదలైంది. పార్టీలో పెరిగిపోయిన అవినీతి, అప్రజాస్వామిక పోకడలే ఓటమికి కారణమని పలువురు నేతలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. మాజీ క్రికెటర్, మాజీ మంత్రి మనోజ్ తివారీ టీఎంసీ నాయకత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ ఒక్కో అభ్యర్థి నుంచి రూ.5 కోట్లు డిమాండ్ చేసిందని ఆయన ఆరోపించారు. తాను ఆ డబ్బు ఇచ్చేందుకు నిరాకరించడం వల్లే తనకు టికెట్ దక్కలేదని, సుమారు 72 మంది అభ్యర్థులు కోట్లు చెల్లించి టికెట్లు కొనుగోలు చేశారని ఆయన ఆరోపించారు.

సస్పెన్షన్ నేతల తీవ్ర ఆరోపణలు

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారన్న నెపంతో టీఎంసీ ప్రతినిధులు రిజు దత్తా, కోహినూర్ మజుందార్, కార్తీక్ ఘోష్‌లను పార్టీ ఆరేళ్ల పాటు సస్పెండ్ చేసింది. సస్పెన్షన్‌కు గురైన రిజు దత్తా సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో పార్టీ ఒత్తిడి, బెదిరింపుల వల్లే బీజేపీ నేత సువేందు అధికారిపై విమర్శలు చేశానని చెబుతూ ఆయనకు క్షమాపణలు కోరారు. అభిషేక్ బెనర్జీని కలవాలంటే నేతలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని, సీనియర్ నేతలకు కనీస గౌరవం దక్కడం లేదని కోహినూర్ మజుందార్ అసహనం వ్యక్తం చేశారు. వరుసగా వస్తున్న ఈ ఆరోపణలు




పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి. పార్టీలో ఉన్నత స్థాయిలో జరుగుతున్న అవినీతి వల్లే ప్రజలు తమను తిరస్కరించారని అసమ్మతి నేతలు స్పష్టం చేస్తున్నారు.

# అక్రమంగా మట్టి దందా.. మామూళ్ల మత్తులో అధికారులు.!

**మట్టి తీసుకొని వెళ్తుండగా చిన్న చిన్న వాహనదారులకు తప్పని తిప్పలు**

**ఓవర్ లోడ్ తో ప్రమాదం జరిగితే పట్టించుకునే నాధుడే కరువు**

**చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, నారాయణ ఖేడ్ :** మనూరు మండలంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వైనం. మట్టి తరలించేందుకు అనుమతులు తప్పనిసరి అయినా మండలంలో అక్రమంగా మట్టి తరలించబోతున్న పట్టించుకోని అధికారులు కరువయ్యారు. పేదవాడికి మట్టి కావాలంటే ఎన్నో అంశాలు పెట్టి అధికారులు దళారులు అధికారులు రెవెన్యూ దళారులు పర్మిషన్ తీసుకోకపోయినా ఎందుకు స్వేచ్ఛగా వదిలేస్తున్నారు. ఇష్టానుసారంగా ఎవ్వరికీ అందినంత వారు మంజీర నదిలో ఇష్టానుసారంగా మట్టిని తబ్బుకొని రైతులకు 2000 నుంచి 2500 వరకు అన్ని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని మండల ప్రజలు వాపోతున్నారు. అధికారులు మట్టి మాఫియా వాళ్ళతో కుమ్మక్కై అధిక లాభాలను మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. మండలంలో రెండు నెలల నుంచి మాంజిర నది పరివాహక ప్రాంతం నుంచి మట్టిని జెసిబిల సాయంతో టిప్పర్ల నింపుకొని



మండలంలోని పలు గ్రామాలకు తరలిస్తున్నారు. పలు గ్రామాల ప్రజలు అధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. మండలంలో మట్టి దందా జోరుగా సాగుతోంది. మంజీరా నది పరివాహక ప్రాంతం నుండి నింపడానికి జెసిబికి తీసుకుపోవడానికి టిప్పర్లకు లెక్క కట్టి దళారులు ధర నిర్ణయించి రైతుల వద్ద ఒక్కొక్క రైతు వద్ద ఒక్క లోడ్ కి సుమారు 2000 నుంచి 2500 వరకు డబ్బులు తీసుకొని సొమ్ము చేసుకుంటున్నారు. సామాన్య ప్రజలు తమ పంట పొలాల్లోకి మట్టి తీసుకుపోవడానికి అనుమతులు ఇవ్వరుగాని అధికారులు.. మట్టి మాఫియా కు మాత్రం చూసి చూడనట్టు వివరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కాంగోలో రెబల్స్ మారణహోమం..
## 70 మందికి పైగా సామాన్యుల మృతి.!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, వెబ్ డెస్క్ :** ఆఫ్రికా దేశమైన డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో లో హింస మరోసారి పడగ విప్పింది. ఈశాన్య ప్రాంతంలోని ఇటూరి ప్రావిన్స్‌లో 'కోడెకో' మిలిషియా గ్రూపు జరిపిన మెరుపు దాడుల్లో కనీసం 69 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల సంఖ్య 70 దాటవచ్చని స్థానిక అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

**ప్రతీకారమే కారణమా?**

ఆ ప్రాంతంలోని ప్రత్యర్థి గ్రూపులకు వ్యతిరేకంగా 'కోడెకో' ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. ఇటూరి ప్రావిన్స్ బంగారు గనులకు ప్రసిద్ధి చెందడం వల్ల, ఈ వనరులపై పట్టు సాధించేందుకు వివిధ సాయుధ ముఠాల మధ్య దశాబ్దాలుగా పోరు సాగుతోంది. దాడులు జరిగిన ప్రాంతంలో భద్రత తక్కువ ఉండటం, రెబల్స్ సంచారం ఎక్కువగా ఉండటంతో, మృతదేహాలను వెలికితీయడానికి సమయం పడుతోందని అధికారులు పేర్కొన్నారు. అయితే బంగారు గనుల దోపిడీయే లక్ష్యంగా సాగుతున్న ఈ జాతుల మధ్య ఘర్షణలు వేలాది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ ప్రాంతంలో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళాలు ఉన్నప్పటికీ, మారుమూల గ్రామాల్లో సామాన్యులకు రక్షణ కరువైందని మానవ హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తాజా దాడుల నేపథ్యంలో ఇటూరి ప్రావిన్స్‌లో ప్రభుత్వం భారీగా సైనిక బలగాలను మోహరించింది.

## షాద్‌నగర్‌లో వ్యక్తి హత్య కలకలం



**హైదరాబాద్ పల్స్ న్యూస్ , మే 10, షాద్ నగర్:** గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. షాద్ నగర్ పట్టణ సీఐ కె. సీతారాం కథనం ప్రకారం... నవాబ్ పేట మండలం పోమల్ గ్రామానికి చెందిన పల్లె కేశవులు(39) తన భార్యాబిడ్డలతో కలిసి షాబాద్ మండలం, సర్దార్ నగర్ గ్రామంలో శ్రీనివాసరావు వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తూ నివసిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం కేశవులు తన యజమాని వద్ద రూ. 50 వేల నగదును తీసుకొని పరిగి వెళ్లాడు. ఓ కేసు విషయంలో తన నలుగురు అన్నదమ్ములతో కలిసి న్యాయవాది గోపాల్ వద్దకు వెళ్లి చర్చించారు. రాత్రి 8:30 గంటలకు పరిగి బస్టాండ్ లో బస్సు ఎక్కి షాద్ నగర్ బస్టాండుకు చేరుకున్నాడు. తన భార్య పద్మకు ఫోన్ చేసి షాద్ నగర్ చేరుకున్నానని, ఇంటికి వస్తున్నానని తెలిపిన అనంతరం కేశవులు ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు వీర్లపల్లి రహదారిలో ఎస్ఆర్ఆర్ వెంచర్ లో కేశవులు మృతదేహం ఉందని తెలిసి భార్య వెళ్లి చూడగా తలపై గాయాలతో మృతి చెందినట్లు గమనించింది. తన భర్తను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారని షాద్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


## ప్రధాని మోదీ సభకు బయలుదేరిన రాజపేట బిజెపి శ్రేణులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలోని అన్ని గ్రామాల నుండి ప్రధాని మోదీ బహిరంగ సభకు ఆదివారం బిజెపి శ్రేణులు ప్రజలు అధిక సంఖ్యలో బయలుదేరారు. ప్రత్యేక వాహనాలలో ఆయా గ్రామాల నుండి అనేక మంది స్వచ్ఛందంగా కూడా తరలివచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు మేకల రమేష్ ఆధ్వర్యంలో సభకు బయలుదేరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిజెపి నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు నాయకులు పార్టీ పెద్దలు కార్యకర్తలు అభిమానులు ప్రజలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ పాఠశాలలో నేటి నుండి వేసవి శిక్షణ శిబిరం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేడు విద్యార్థులకు ఉచిత లివేసవి శిక్షణ శిబిరంలి ప్రారంభం అవుతుందని ఎంఈఓ చందా రమేష్, ప్రోగ్రాం ఇంచార్జ్ పీఎం శ్రీ హై స్కూల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు తడ్క రాజు లు తెలిపారు. ఆదివారం విలేకరులకు వివరాలు చెబుతూ మండలం లోని విద్యార్థులు అందరూ ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ శిబిరంలో పాల్గొనే విద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మండలంలోని ప్రవేటు, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిబిరంలో పాల్గొనవచ్చునని అన్నారు. ఈ 15 రోజుల శిబిరంలో విద్యార్థులకు అల్పాహారాన్ని అందిస్తూ ఇండోర్ గేమ్స్, జనరల్ నాలెడ్జ్, వ్యక్తిత్వ వికాసం, బొమ్మల తయారీ, సంగీతం , డ్రాయింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రుల వారిని ప్రోత్సహిస్తూ పంపించాలని కోరారు

# భువనగిరిలో 'కుంభం ఫౌండేషన్' జాబ్ మేళా - నిరుద్యోగులకు వరం : ఎంపీ చామల




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరిలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా కుంభం ఫౌండేషన్,1 మిలియన్ 1 బిలియన్ నైపుణ్య నిర్మాణం సహకారంతో నిర్వహించిన భారీ ఉపాధి మేళా (జాబ్ మేళా) అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగింది. కుంభం ఫౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మేళాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మరియు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్య అతిథి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ....యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమని కొనియాడారు. ఐబిఎం వంటి ప్రతిష్టాత్మక సంస్థల సహకారంతో ఇలాంటి వేదికలు ఏర్పాటు చేయడం వల్ల స్థానిక యువతకు అంతర్జాతీయ స్థాయి కంపెనీలలో ఉద్యోగాలు పొందే అవకాశం దక్కుతుందని అన్నారు. ఈ జాబ్ మేళాకు నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రాథమిక ఇంటర్వ్యూల అనంతరం ఎంపికైన అభ్యర్థులకు అతిథుల చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ కంపెనీల ప్రతినిధులు మరియు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

# యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి : ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు చేరువ చేయడమే ఈ జాబ్ మేళా**

**మెగా జాబ్ మేళాలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని న్యూ డైమేనేషన్ స్కూల్‌లో కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో, 1 మిలియన్ 1 బిలియన్ సంస్థ సహకారంతో నిర్వహించిన మెగా జాబ్ మేళా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కుంభం ఫౌండేషన్ కుంభం కీర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతను ఉద్దేశించి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత నైపుణ్యాలను పెంపొందించుకొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం యువత ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇలాంటి జాబ్ మేళాలు నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. అలాగే విద్యార్థులు కేవలం విద్యతో సరిపెట్టుకోకుండా సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. యువత తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఇలాంటి వేదికలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు చేరువ చేయడమే ఈ జాబ్ మేళా ముఖ్య ఉద్దేశమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉపాధి కార్యక్రమాలు నిర్వహించి యువతకు అండగా నిలుస్తామని చెప్పారు. యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొన్న వివిధ కంపెనీల




ప్రతినిధులతో మాట్లాడి యువతకు ఎక్కువ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ మెగా జాబ్ మేళాలో వందలాది మంది నిరుద్యోగ యువత పాల్గొని వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాల కోసం ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి ప్రత్యేక విద్యా వారోత్సవాలు

**విద్యాశాఖ మరింత బలోపేతానికి ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 10, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రత్యేక విద్యా వారోత్సవం (ఎడ్యుకేషన్ వీక్ ) రోజు వారీ కార్యాచరణ ప్రణాళిక.... ప్రజా పాలన - ప్రజా దినోత్సవాలతో అనుసంధానంగా నిర్వహించబడే ప్రత్యేక విద్యా వారోత్సవంను విద్యాశాఖ బలోపేతానికి ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలను ప్రజలల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి శక్తివంతమైన వేదికగా వినియోగించుకోవాలని విద్యాశాఖ అధికారులు వివరించారు. ఇది మా విజయాలు, ఆవిష్కరణలు నిబద్ధతను ప్రజలకు చేరవేయడానికి ఒక మంచి అవకాశం. జిల్లా విద్యాశాఖ అధికారులు ముందుండి నాయకత్వం వహించి, ఈ వారంలో నిర్వహించే కార్యక్రమాలు ఉత్సాహభరితంగా, స్పష్టంగా, ప్రభావవంతంగా జరిగేలా చూడాలి.

**రోజు-1**: ఫౌండేషన్ డే,సమ్మర్ క్యాంపులు (11 మే 2026)

-పాఠశాల మౌలిక వసతుల ఫౌండేషన్ కార్యక్రమాలు, సమ్మర్ క్యాంపులను ప్రజా ప్రతినిధులు, ప్రముఖుల పాల్గొనికతో ఘనంగా ప్రారంభించాలి.

-కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించి, విద్యార్థుల పాల్గొనికను పెంచాలి.

**సమ్మర్ క్యాంపులు:**

-పి. ఎం. శ్రీ హైస్కూల్స్‌లో నిర్వహించాలి.

-ప్రతి జిల్లాలో ఒక కే. జి. బి. వి. ను రెసిడెన్షియల్ క్యాంప్ కోసం గుర్తించాలి (11-మే -2026 నుండి 25- మే -2026 వరకు).

-క్యాంపుల్లో అకాడెమిక్ ఎన్‌రిచ్‌మెంట్, కోడింగ్, కళలు, క్రీడలు, యోగా, వ్యక్తిత్వ వికాసం కార్యక్రమాలు ఉండాలి.

-రిసోర్స్ పర్సన్స్, వాలంటీర్లు, సబ్జెక్ట్ నిపుణులను నియమించాలి.

-పాఠ్యసామగ్రి, తాగునీరు, శుభ్రత, విద్యార్థుల భద్రత కల్పించాలి.

ఫౌండేషన్/గ్రౌండ్ బ్రేకింగ్ కార్యక్రమాలు:

-కొత్త పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదులు, ల్యాబ్‌లు, మరుగుదొడ్లు తదితర పనులకు శంకుస్థాపన నిర్వహించాలి.

-ఇంజినీరింగ్ విభాగాలు, అమలు సంస్థలతో సమన్వయం కలిగి ఉండాలి.

-ప్రజా ప్రతినిధులు, సమాజ సభ్యులు పాల్గొనేలా చూడాలి.

-ప్రచారం, డాక్యుమెంటేషన్ చేయాలి.

**రోజు-2:** ఎస్ ఎస్ సి రీమిడియల్ క్యాంపులు (12-05-2026 నుండి)

-ప్రతి జిల్లాలో ఎస్ ఎస్ సి విద్యార్థుల కోసం 2 ప్రత్యేక రీమిడియల్ క్యాంపులు నిర్వహించాలి.

-పీ. ఎం శ్రీ పాఠశాలల్లో నిర్వహించాలి.

-కాలవ్యవధి: అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ప్రారంభం వరకు.

-సమయం: ప్రతిరోజూ ఉదయం 9:30 నుండి సాయంత్రం 4:30 వరకు.

నిర్వహణ:

-ఏ డి స్థాయి అధికారి మొత్తం ఇన్‌చార్జ్‌గా ఉండాలి.

-ఇద్దరు పి. జి. హెచ్. ఎం. లు అకాడెమిక్ ఇన్‌చార్జ్‌లుగా ఉండాలి.

-ప్రతి సబ్జెక్ట్‌కు నిపుణులను నియమించాలి.

**విద్యార్థుల సహాయం:**

-100 - స్టేషనరీ

-1,000 - రవాణా

భోజనం, తాగునీరు, శుభ్రత ఏర్పాటు చేయాలి.

-హాజరు, పర్యవేక్షణ కచ్చితంగా చేయాలి.

-రోజు--3లి: సర్పంచులతో వర్క్‌షాప్

-అన్ని సర్పంచులతో జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించాలి.

-పెద్ద వేదికను ఎంపిక చేయాలి.

-భోజనం, అల్పాహారం ఏర్పాటు చేయాలి.

-పూర్తి సమన్వయం, ప్రచారం చేయాలి.

ప్రతిపాదిత కార్యాచరణ (10:00 ఏ ఎం - 4:00 పి ఎం ):

-10-11: విద్యాశాఖ సమీక్ష ఢ విజయాలు

-11-12: ఏ ఏ పి సి, కమ్యూనిటీ భాగస్వామ్యం

-12-1: తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఢ మౌలిక వసతులు

1-2: భోజన విరామం

2-3: అకాడెమిక్ కార్యక్రమాలు

3-4: విద్యార్థి సంక్షేమం ఢ చర్చ

-ప్రతి జిల్లాకు ?2,50,000 విడుదల చేయబడుతుంది.

**రోజు-4 :** జయశంకర్ బడి బాట ఢ మెగా పి టి ఎం

అన్ని పాఠశాలల్లో బడి బాట (ఎన్‌రోల్మెంట్ డ్రైవ్) నిర్వహించాలి.

పాఠశాలలను శుభ్రపరచి అలంకరించాలి.

ఇంటింటి ప్రచారం చేయాలి.

-ప్రీ-ప్రైమరీ విభాగాలు సిద్ధంగా ఉంచాలి.

-మెగా పి టి ఎం నిర్వహించాలి.

-సమాజ భాగస్వామ్యాన్ని పెంచాలి.

**రోజు-5**: లైబ్రరీ డే

అన్ని పాఠశాలలు, గ్రామ, పట్టణ లైబ్రరీల్లో నిర్వహించాలి.

పఠన కార్యక్రమాలు, పుస్తక ప్రదర్శనలు నిర్వహించాలి.

విద్యార్థుల్లో పఠన అలవాటును ప్రోత్సహించాలి.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేయాలి.

**రోజు-6:** కళలు, సాంస్కృతిక దినోత్సవం

-జవహర్ బాలభవన్ మరియు మండల స్థాయిలో నిర్వహించాలి.

కళలు, హస్తకళలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించాలి.

పర్యావరణ హిత పదార్థాలు ఉపయోగించాలి.

**రాష్ట్ర స్థాయి:**

ఎంపికైన చిత్రాలు, కళాకృతులు రాష్ట్ర కార్యాలయానికి పంపాలి.

స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శన ఉంటుంది.

**రోజు-7:** జవహర్ బాలభవన్ దినోత్సవం (17-మే -2026)

-ఈ రోజును "జవహర్ బాలభవన్ డే"గా నిర్వహించాలి.


-ఇంద్రా ఆడిటోరియంలో ప్రధాన కార్యక్రమం నిర్వహించబడుతుంది.

-విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

-ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొంటారు.

-సృజనాత్మకతకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

## కిడ్నీ బాధితులు పుచ్చకాయ తినడం మంచిదేనా?




ఇంటర్నెట్ డెస్క్: వేసవిలో చాలా మంది పుచ్చకాయ తినడానికి ఇష్టపడతారు. ఇది శరీరానికి అవసరమైన నీటిని అందించి డీహైడ్రేషన్ నుంచి రక్షిస్తుంది. పుచ్చకాయలో దాదాపు 90% వరకు నీరు ఉంటుంది కాబట్టి శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహాయపడుతుంది. అయితే, కిడ్నీ సమస్యలు ఉన్నవారు పుచ్చకాయ తినవచ్చా? పుచ్చకాయ కిడ్నీలను క్లీన్ చేస్తుందా? అనే విషయంపై చాలామందికి సందేహాలు ఉన్నాయి. దీనిపై నిపుణుల అభిప్రాయాలు ఏమిటో తెలుసుకుందాం..వైద్య నిపుణుల ప్రకారం, పుచ్చకాయ కిడ్నీలను క్లీన్ చేస్తుందనే మాట పూర్తిగా నిజం కాదు. మన శరీరంలోని వ్యర్థాలను తొలగించే పని ప్రధానంగా మూత్రపిండాలే చేస్తాయి. పుచ్చకాయ మాత్రం శరీరానికి తేమను అందించి హైడ్రేషన్‌ను మెరుగుపరుస్తుంది.

**మితంగా తీసుకోవాలి**

ఈ పండులో విటమిన్ సి, పొటాషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీర ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. అయితే, దీన్ని మితంగా తీసుకోవడం మంచిది. అధికంగా తింటే చక్కెర స్థాయిలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకున్న తర్వాత మాత్రమే పుచ్చకాయ తినడం మంచిది. కొన్ని పరిస్థితుల్లో పొటాషియం పరిమితి ఉండే కారణంగా జాగ్రత్త అవసరం.పుచ్చకాయ ఆరోగ్యకరమైన పండు అయినప్పటికీ, ఇది మూత్రపిండాలను శుభ్రపరుస్తుందనే మాట శాస్త్రీయంగా సరైనది కాదు. అయితే శరీరానికి అవసరమైన నీటిని అందించి హైడ్రేషన్‌ను మెరుగుపరచడంలో ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## 14 రోజులపాటు రోజూ ఒక కోడిగుడ్డును తింటే శరీరంలో కనిపించే మార్పులు ఇవే..!

గుడ్లు రోజువారీ ఆహారంలో అత్యంత సాధారణంగా ఉపయోగించే పదార్థాల్లో ఒకటి. వీటిని తేలికగా వండుకోవచ్చు, ఎన్నో వంటకాలతో కలిపి తినవచ్చు, ముఖ్యంగా ప్రోటీన్ కోసం చాలా మంది గుడ్లపై ఆధారపడుతుంటారు. కొందరికి ఇవి ప్రతి రోజు బ్రేక్‌ఫాస్ట్‌లో తప్పనిసరి కాగా, మరికొందరికి కొలెస్ట్రాల్ గురించి సందేహాలు ఉంటాయి. అయితే గుడ్లు కేవలం సులభమైన ఆహారమే కాదు, ఇవి శరీరానికి అవసరమైన అనేక పోషకాలను కలిగి ఉంటాయి. మెదడు పనితీరు, శక్తి స్థాయిలు, చర్మం, జుట్టు, కంటి ఆరోగ్యం వంటి అంశాల్లో కూడా గుడ్లు ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఇక 14 రోజుల పాటు గుడ్లను ప్రతిరోజూ తింటే శరీరంలో కొన్ని మార్పులు కనిపిస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

14 రోజులపాటు రోజూ ఒక కోడిగుడ్డును తింటే శరీరంలో కనిపించే మార్పులు ఇవే..!గుడ్లు రోజువారీ ఆహారంలో అత్యంత సాధారణంగా ఉపయోగించే పదార్థాల్లో ఒకటి. వీటిని తేలికగా వండుకోవచ్చు, ఎన్నో వంటకాలతో కలిపి తినవచ్చు, ముఖ్యంగా ప్రోటీన్ కోసం చాలా మంది గుడ్లపై ఆధారపడుతుంటారు. కొందరికి ఇవి ప్రతి రోజు బ్రేక్‌ఫాస్ట్‌లో తప్పనిసరి కాగా, మరికొందరికి కొలెస్ట్రాల్ గురించి సందేహాలు ఉంటాయి. అయితే గుడ్లు కేవలం సులభమైన ఆహారమే కాదు, ఇవి శరీరానికి అవసరమైన అనేక పోషకాలను కలిగి ఉంటాయి. మెదడు పనితీరు, శక్తి స్థాయిలు, చర్మం, జుట్టు, కంటి ఆరోగ్యం వంటి అంశాల్లో కూడా గుడ్లు ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఇక 14 రోజుల పాటు గుడ్లను ప్రతిరోజూ తింటే శరీరంలో కొన్ని మార్పులు కనిపిస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

మెదడు పనితీరుకు, కళ్ల ఆరోగ్యానికి..

మొదటగా మెదడు పనితీరు మెరుగుపడుతుంది. గుడ్లలో కోలిన్ అనే పోషకం అధికంగా ఉంటుంది. ఇది మెదడులో అసెటైల్కోలిన్ అనే న్యూరోట్రాన్స్‌మిటర్ తయారీలో సహాయపడుతుంది. ఇది జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను మెరుగుపరచడంలో సహకరిస్తుంది. రెండవది, కొలెస్ట్రాల్ సమతుల్యం మెరుగుపడే అవకాశం ఉంటుంది. గుడ్లు కొలెస్ట్రాల్ పెంచుతాయని భావన ఉన్నప్పటికీ, చాలా మందిలో ఇవి హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్) స్థాయిలని పెంచడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది గుండె ఆరోగ్యానికి ఉపయోగకరం. మూడవది, కంటి ఆరోగ్యానికి గుడ్లు మేలు చేస్తాయి. గుడ్ల పచ్చసొనలో లుటీన్, జియాజాంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి హానికరమైన బ్లూ లైట్ నుంచి కళ్లను రక్షించడంలో సహాయపడతాయి. దీర్ఘకాలికంగా కంటి ఆరోగ్యాన్ని కాపాడుతాయి.

జుట్టు, చర్మం సంరక్షణకు..

నాలుగవది, జుట్టు, చర్మం, గోర్లు ఆరోగ్యంగా ఉండటానికి గుడ్లు సహాయపడతాయి. గుడ్లలో సల్ఫర్ కలిగిన అమినో ఆమ్లాలు ఉంటాయి. ఇవి కెరాటిన్ అనే ప్రోటీన్ తయారీలో కీలక పాత్ర పోషిస్తాయి. దీంతో జుట్టు బలంగా, చర్మం ఆరోగ్యంగా, గోర్లు దృఢంగా మారుతాయి. ఇలా 14 రోజుల పాటు గుడ్లు తీసుకోవడం వల్ల శరీరంలో అనేక మంచి మార్పులు జరుగుతాయి. ఇక గుడ్లు తినని వారు కూడా ప్రత్యామ్నాయంగా కొన్ని ఆహారాలను తీసుకోవచ్చు. వెజిటేరియన్ల కోసం సోయా ఆధారిత ఆహారాలు మంచి ఎంపిక అని నిపుణులు సూచిస్తున్నారు. టోఫు, టెంపె, ఎడమామే వంటి పదార్థాలు గుడ్లకు దగ్గరైన ప్రోటీన్ వనరులుగా పనిచేస్తాయి. సమతుల ఆహారంలో భాగంగా గుడ్లను తీసుకుంటే అవి శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. మెదడు పనితీరు, గుండె ఆరోగ్యం, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో గుడ్లు ఉపయోగకరంగా ఉంటాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

# మామిడి పండ్లతో రక్తపోటుకు చెక్

## కానీ ఈ జాగ్రత్తలు తీసుకుంటేనే మేలు!

**మామిడిలోని పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయం చేస్తుందన్న నిపుణులు**

**మామిడి తిన్న రెండు గంటల్లోనే బీపీ తగ్గుతున్నట్టు అధ్యయనాల్లో వెల్లడి**

**గుండెకు మేలు చేసే మామిడిలోని మెగ్నీషియం, మాంగిఫెరిన్ వంటి పోషకాలు**

**అధిక చక్కెరల కారణంగా మామిడి పండ్లను మితంగా తీసుకోవడం ముఖ్యం**

**ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యులను సంప్రదించిన తర్వాతే తినడం బెటర్**



వేసవి వచ్చిందంటే చాలు, మామిడి పండ్ల సీజన్ మొదలైనట్టే. పండ్ల రారాజుగా పిలుచుకునే మామిడిని ఇష్టపడని వారు చాలా అరుదు. అయితే, రక్తపోటు (బీపీ) సమస్య ఉన్నవారు మామిడి పండ్లు తినొచ్చా? లేదా? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే రక్తపోటును అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యం. మరి ఈ విషయంలో మామిడి పండు ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసుకుందాం.నిపుణుల ప్రకారం మామిడి పండ్లు రక్తపోటును నియంత్రించడంలో సానుకూల పాత్ర పోషిస్తాయి. వీటిలో అధికంగా ఉండే పొటాషియం, శరీరంలో సోడియం స్థాయులను సమతుల్యం చేస్తుంది. ఇది రక్తనాళాల గోడలపై ఒత్తిడిని తగ్గించి, అవి రిలాక్స్ అయ్యేలా చేస్తుంది. ఫలితంగా రక్తపోటు అదుపులోకి వస్తుంది. ఇటీవల జరిగిన కొన్ని అధ్యయనాల్లో మామిడి పండు తిన్న రెండు గంటల్లోనే సిస్టోలిక్ రక్తపోటులో స్పష్టమైన తగ్గుదల కనిపించినట్లు తేలింది.

గుండె ఆరోగ్యానికి మామిడి

మామిడిలో పొటాషియంతో పాటు మెగ్నీషియం, మాంగిఫెరిన్ అనే ప్రత్యేక యాంటీఆక్సిడెంట్, ఫైబర్ వంటి ఎన్నో ముఖ్య పోషకాలు ఉంటాయి. మెగ్నీషియం రక్తనాళాలు సక్రమంగా పనిచేయడానికి సహాయపడితే, మాంగిఫెరిన్ గుండె కణాలను ఆక్సీకరణ ఒత్తిడి నుంచి కాపాడుతుంది. ఇక ఫైబర్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండెపై భారాన్ని తగ్గిస్తుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

మామిడి పండ్లతో ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ, వాటిని మితంగా తీసుకోవడం చాలా అవసరం. ఎందుకంటే వీటిలో సహజ చక్కెరలు అధికంగా ఉంటాయి.ఒకేసారి ఎక్కువ తినకుండా, రోజుకు ఒక మీడియం సైజు మామిడి పండుకు పరిమితం చేసుకోవడం మంచిది.మామిడి పండు తిన్నప్పుడు, రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా ఉండేందుకు వాటిని నట్స్ వంటి ప్రోటీన్లు లేదా ఆరోగ్యకరమైన కొవ్వులతో కలిపి తినడం మేలు.ప్యాక్ చేసిన జ్యూస్‌లు, సిరప్‌లకు బదులుగా తాజా పండును తినడానికే ప్రాధాన్యత ఇవ్వాలి. దీనివల్ల పూర్తి ఫైబర్ ప్రయోజనాలు అందుతాయి.ముఖ్యంగా ఇప్పటికే రక్తపోటు, మధుమేహం లేదా ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఆహారంలో మార్పులు చేసుకునే ముందు తప్పనిసరిగా వైద్యులను లేదా డైటీషియన్‌ను సంప్రదించాలి.మొత్తం మీద సమతుల్య ఆహారంలో భాగంగా మామిడి పండ్లను తెలివిగా, మితంగా ఆస్వాదిస్తే రక్తపోటు నియంత్రణతో పాటు ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

## పెరుగుతున్న ఎండలతో యాంటీ బయోటిక్ రెసిస్టెన్స్ పెరిగే ప్రమాదం..

## సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి..

ఎండలు, వర్షాభావం కారణంగా నేల ఎండిపోవడం వల్ల యాంటీ బయోటిక్ రెసిస్టెన్స్ పెరిగే ప్రమాదం ఉందని తాజా పరిశోధన వెల్లడించింది. ఈ విశ్లేషణ ప్రకారం నేలలోని తేమ తగ్గిపోవడం సహజ యాంటీబయోటిక్స్ పరిమాణాన్ని పెంచుతూ, వాటికి ప్రతిఘటన చూపే బ్యాక్టీరియా వృద్ధిని ప్రోత్సహిస్తోందని తేలింది. ఈ పరిశోధనను Nature Microbiology journal లో ప్రచురించారు. వాతావరణ మార్పుల ప్రభావంతో పెరుగుతున్న ఎండలు, నేలలోని పొడిబారుదల పెరగడానికి కారణమవుతున్నాయి. దీని ఫలితంగా యాంటీబయోటిక్ రెసిస్టెన్స్ కూడా పెరిగే అవకాశముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అమెరికాలోని ఝశ్రీఱటశీతీఅఱ California Institute of Technology కు చెందిన పరిశోధకులు 116 దేశాల్లోని ఆసుపత్రుల నుంచి సేకరించిన యాంటీ బయోటిక్ రెసిస్టెన్స్ డేటాను, ఆయా ప్రాంతాల వర్షపాతం, ఉష్ణోగ్రతలతో పోల్చారు. ఈ విశ్లేషణలో, ఎక్కువగా పొడి పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో యాంటీబయోటిక్ రెసిస్టెన్స్ స్థాయి కూడా ఎక్కువగా ఉండటం గమనించారు.

ఎండలు ఎక్కువైతే..

శాస్త్రవేత్తల ప్రకారం నేలలో సహజంగా యాంటీబయోటిక్స్ ఉత్పత్తి చేసే సూక్ష్మజీవులు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఒకదానికొకటి వ్యతిరేకంగా పోరాడటానికి ఈ రసాయనాలను ఉత్పత్తి చేస్తాయి. అయితే ఎండలు ఎక్కువైనప్పుడు, ఈ యాంటీబయోటిక్స్ సాంద్రత పెరిగి, వాటికి సున్నితంగా స్పందించే బ్యాక్టీరియా తగ్గిపోతుంది. అదే సమయంలో రెసిస్టెంట్ బ్యాక్టీరియా మాత్రం నిలబడగలుగుతుంది. పరిశోధనలో భాగంగా కాలిఫోర్నియాలోని పంట భూములు, గడ్డి భూములు, స్విట్జర్లాండ్‌లోని అడవులు, చైనాలోని తడి భూముల నుంచి సేకరించిన మట్టి నమూనాలను పరిశీలించారు. ఈ డేటాలో కూడా ఎండ పరిస్థితుల్లో యాంటీబయోటిక్ ఉత్పత్తి చేసే జన్యువులు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు.



మనుషులపై ప్రభావం చూపిస్తాయా..

ల్యాబ్ ప్రయోగాల్లో కూడా ఇదే విషయం నిర్ధారితమైంది. నీటి శాతం తగ్గినప్పుడు యాంటీబయోటిక్స్ సాంద్రత పెరిగి, సాధారణ బ్యాక్టీరియా 99 శాతం వరకు తగ్గిపోవడం కనిపించింది. కానీ యాంటీబయోటిక్ రెసిస్టెంట్ బ్యాక్టీరియా మాత్రం ప్రభావితం కాలేదు. ఈ ఫలితాలు వాతావరణ మార్పులు ప్రజారోగ్యంపై మరొక కొత్త కోణంలో ప్రభావం చూపుతున్నాయని సూచిస్తున్నాయి. అయితే ఈ మార్పులు మనుషుల ఆరోగ్యంపై ఎంతవరకు ప్రభావం చూపుతాయన్నది ఇంకా పూర్తిగా స్పష్టత రాలేదని పరిశోధకులు పేర్కొన్నారు. ఈవిధంగా వాతావరణ మార్పుల కారణంగా పెరుగుతున్న ఎండలు కేవలం పర్యావరణానికే కాకుండా, యాంటీ బయోటిక్ రెసిస్టెన్స్ పెరుగుదలకు కూడా దోహదపడుతున్నాయని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది.

## ఈ సీజన్‌లో ప్రోటీన్లు లభించాలంటే.. ఈ ఆహారాలను తీసుకోవాలి.. ఎంతో మేలు చేస్తాయి..

వేసవి కాలంలో శరీరానికి తేలికగా, చల్లదనాన్ని అందించేలా ఉండే ప్రోటీన్ ఆహారాలను ఎంపిక చేయడం చాలా ముఖ్యం. అధిక ఉష్ణోగ్రతల సమయంలో శరీరం తన ఉష్ణోగ్రతను నియంత్రించడానికి ఎక్కువ శ్రమ పడుతుంది. అందుకే ఈ సమయంలో తీసుకునే ఆహారం తేలికగా జీర్ణమయ్యేలా, శరీరానికి శక్తినిచ్చేలా ఉండాలి. కనుక ఇటువంటి సమయంలో ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రోటీన్ సాధారణంగా బరువు తగ్గడానికే ఉపయోగపడుతుందని అనుకుంటారు. కానీ వాస్తవానికి ఇది శరీర నిర్మాణానికి ప్రధాన మూలం. కండరాల పునరుద్ధరణ, రోగ నిరోధక శక్తి పెంపు, అలాగే ఎక్కువసేపు తృప్తిగా ఉండటానికి ఇది కీలకం. ముఖ్యంగా శరీరం ప్రోటీన్‌ను నిల్వ చేసుకోలేకపోవడం వల్ల ప్రతిరోజూ ఆహారంలో చేర్చడం అవసరం. వేసవిలో ప్రోటీన్ ఆహారాలను ఎంచుకునే సమయంలో అవి తేలికగా, హైడ్రేటెడ్‌గా, జీర్ణానికి సులభంగా ఉండేలా చూసుకోవాలి. దీంతో శరీరంలో అధిక వేడి పెరగకుండా, శక్తి స్థాయిలు సంతుల్యంగా ఉంటాయి. వేసవి కాలంలో తీసుకోవాల్సిన ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.

చికెన్ బ్రెస్ట్, చేపలు, పనీర్..

లీన్ మీట్స్‌గా చెప్పబడే చికెన్ బ్రెస్ట్, చేపలు వేసవిలో మంచి ఎంపిక. ఇవి ప్రోటీన్ ఎక్కువగా, కొవ్వు తక్కువగా ఉండటం వల్ల శరీరానికి తేలికగా అనిపిస్తాయి. పప్పులు, శనగలు, పెసర్లు వంటి లెగ్యూమ్స్ కూడా ప్రోటీన్‌కు మంచి వనరులు. వీటిని సలాడ్స్‌లో, చల్లని వంటల్లో లేదా హమ్మస్‌లాంటి వంటకాల రూపంలో తీసుకోవచ్చు. శాకాహారులకు ఇవి ఉత్తమ ఎంపిక అని చెప్పవచ్చు. అలాగే గ్రీక్ యోగర్ట్ వేసవిలో చల్లగా తినడానికి అనువైన ప్రోటీన్ ఆహారం. దీన్ని పండ్లతో కలిపి లేదా స్మూతీగా తీసుకుంటే శరీరానికి తేలికగా ఉంటుంది. అలాగే ఇందులో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణక్రియకు సహాయపడతాయి. అదే విధంగా కాటేజ్ చీజ్ (పనీర్) కూడా ప్రోటీన్‌ను సమృద్ధిగా కలిగి ఉంటుంది. దీన్ని కర్రీల్లో, పరాటాల్లో లేదా సలాడ్స్‌లో కలిపి తీసుకోవచ్చు. బాదం, అక్రోట్, చియా గింజలు, ఫ్లాక్స్ సీడ్స్ వంటి నట్లు, గింజలు ప్రోటీన్‌తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులను అందిస్తాయి. ఇవి మధ్యాహ్నం ఆకలి వేయకుండా నిరోధిస్తాయి.

మజ్జిగ, సత్తు పిండి..

మజ్జిగ (చాస్) వేసవిలో అత్యుత్తమ శీతల పానీయం. ఇది శరీరాన్ని చల్లగా ఉంచడంతోపాటు పొటాషియం, కాల్షియం వంటి ఖనిజాలను అందిస్తుంది. అలాగే గట్ హెల్త్‌కి కూడా ఉపయోగపడుతుంది. సత్తు (వేయించిన శనగ పిండి) వేసవిలో చాలా ప్రాచుర్యం పొందిన ఆహారం. ఇది శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడమే కాకుండా ఫైబర్‌ను సమృద్ధిగా అందిస్తుంది. కినోవా పూర్తిస్థాయి ప్రోటీన్ వనరు. దీనిలో అన్ని అవసరమైన అమినో ఆమ్లాలు ఉంటాయి. దీనిని సలాడ్స్‌లో లేదా చల్లని బౌల్స్‌గా తీసుకోవచ్చు. టోఫు, టెంపె వంటి ప్లాంట్-బేస్డ్ ప్రోటీన్ ఆహారాలు కూడా వేసవిలో అనువైనవి. వీటిని గ్రిల్ చేసి లేదా సలాడ్స్‌లో కలిపి తీసుకోవచ్చు. వేసవి కాలంలో తేలికగా, శరీరాన్ని చల్లగా ఉంచే ప్రోటీన్ ఆహారాలను తీసుకోవడం ద్వారా శక్తివంతంగా, ఆరోగ్యంగా ఉండవచ్చు. సరైన ఆహారపు అలవాట్లు వేసవి ప్రభావాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.